www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
23 ఆగస్టు 2023
సంపుటి:1 సంచిక:310

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## ప్రకాశ్ రాజ్ పై కేసు

- చంద్రయాన్3 పై వ్యంగ్య పోస్ట్
- కర్ణాటకలో కేసు నమోదు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** ప్రకాశ్ రాజ్ పై కర్ణాటక రాష్ట్రంలో కేసు నమోదైంది. చంద్రయాన్ 3పై వ్యంగ్య పోస్ట్ పెట్టడంతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కొందరు వ్యక్తులు ప్రకాశ్ రాజ్‌పై ఫిర్యాదు చేశారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రయోగాన్ని అపహాస్యం చేశారని వారు ఆరోపించినట్లు పోలీసులు వెల్లడించారు.
'చంద్రయాన్3పై సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టుకు సంబంధించి ఓ ఫిర్యాదు అందింది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ మిషన్‌పై అభ్యంతరకర ట్వీట్ చేసినందుకుగానూ

..మిగతా | 2 | లో



## కామారెడ్డి నుంచి పోటీ వెనుక గులాబీబాస్ మాస్టర్ ప్లాన్..?

### టికెట్లు దక్కని వారికి భారీగా తాయిలాలు

- రంగారెడ్డిలో పాగాకే మహేందర్ రెడ్డికి మంత్రి పదవి
- రాబోయే రోజుల్లో మరిన్ని స్కీముల ప్రకటనలు
- కాంగ్రెస్, బీజేపీ నేతల టచ్ లో అసంతృప్త నేతలు
- త్వరలోనే అధికార పార్టీలో భారీగా రాజీనామాలు
- ఆ రెండు స్థానాల్లో ఎంఐఎంకు అనుకూలంగా అభ్యర్థుల ఎంపిక
- రాజయ్యకు ఎంపీగా అవకాశమిస్తారని జోరుగా ప్రచారం

**హైదరాబాద్,విశాలభారతి:** అసెంబ్లీ ఎన్నికలకు సీఎం కేసీఆర్ 115 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించి.. రేసులో ముందున్నారు. ఆగస్టు నెలలోనే అన్నిపార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తాయని ప్రచారం మొదలైంది. దానికి అనుగుణంగానే అన్నిపార్టీలు సిద్ధమయ్యాయి. అయితే, ముందుగానే బీఆరెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించారు. నాలుగు స్థానాలు పెండింగ్‌లో పెట్టి.. 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో పెద్దగా మార్పులేమీ లేవు. కేసీఆర్ ముందు నుంచీ చెబుతున్నట్టే దాదాపు సిటింగ్‌లందరికీ టికెట్ ఇచ్చారు.

**కామారెడ్డే ఎందుకంటే?**
కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి బరిలోకి దిగడమే ఈసారి సంచలనమైంది. ముచ్చటగా మూడోసారి అధికారం మాదేనని విశ్వాసంతో ఉన్న ముఖ్యమంత్రి ఈసారి రెండు స్థానాల్లో పోటీ చేయనుండటంపైనే చర్చ జరుగుతున్నది. భయంతో సీఎం రెండుచోట్ల పోటీ చేస్తున్నాడని విపక్షాలు ఆరోపించాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2018లో ఒక్క ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తప్ప మిగిలిన 8 స్థానాల్లో బీఆర్ఎస్ జయకేతనం ఎగురవేసింది. ఈసారి అక్కడ బీఆరెస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు

..మిగతా | 2 | లో



## స్నేహ 'హస్తాలు'

### కాంగ్రెస్ వైపు చూపు

- గాంధీభవన్లో సందడి
- ఢిల్లీ పెద్దల టచ్లోకి రాష్ట్ర నేతలు
- ఉద్యమ నేతలకు ప్రయార్టీ
- కాంగ్రెస్తో కలిసేందుకు కామ్రేడ్ల వ్యూహం
- త్వరలోనే హస్తినలో భేటీ!
- ఒకేసారి 80 మందితో ఫస్ట్ లిస్ట్..?

**బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల కాంగ్రెస్లో జోష్ పెంచింది. అధికార పార్టీలో టికెట్లు ఆశించిన వారితో పాటుగా సిట్టింగ్లు గా ఉండి కూడా టికెట్ రాని వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే రేఖా నాయక్ దంపతులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇప్పటిదాకా ఉద్యమ పార్టీలో జెండా మోసి, పదవులు కోసం ఎదురుచూస్తున్న వారంతా ఇప్పుడు హస్తంలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మొన్నటిదాకా కేసీఆర్తో కలిసి నడిచిన వామపక్షాలు.. తాజా పరిస్థితుల్లో పొత్తుల రూపంలో మోసపోయాయి. కామ్రేడ్ల అభ్యర్థనలను కనీసం పరిగణలోకి తీసుకోలేదు. సీపీఐ, సీపీఎం కలిసి చెరో నాలుగు స్థానాలు కోరినా.. కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇవ్వలేదు. వామపక్షాలు కోరిన సెగ్మెంట్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను దింపేశారు. దీంతో వామపక్షాలు కూడా ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయి.**

**విశాలభారతి, తెలంగాణ బ్యూరో:** నిజానికి, ఇండియా పేరుతో దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా జట్టుకట్టిన పార్టీల్లో వామపక్షాలు కూడా ఉన్నాయి. కానీ, రాష్ట్రంలో మాత్రం ఇప్పటి వరకు అధికార పార్టీ వైపు నిలబడ్డాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాలకు ఎర్ర తివాచీ పరిచి ప్రగతి భవన్లోకి ఆహ్వానించిన కేసీఆర్.. ఆ తర్వాత కామ్రేడ్లకు కనీసం అపాయింట్మెంట్కూడా ఇవ్వలేదు. అయినప్పటికీ.. పొత్తులపై ఆశలు పెట్టుకున్న సీపీఐ, సీపీఎంకు కేసీఆర్ కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టారు. దీంతో ఇప్పుడు వారి దృష్టి హస్తం వైపు మళ్లింది.
తొలుత 80 స్థానాలు ప్రకటన
హ్యాట్రిక్‌పై కన్నేసిన బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాల అమలులో స్పీడ్ పెంచగా.. కర్ణాటకలో అధికారం కోల్పోయిన బీజేపీ సౌత్‌లో పాగా వేసేందుకు చాలా కష్టాలు పడుతున్నది. ఇక తెలంగాణ ఇచ్చిన పార్టీగా అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. ఒకేసారి 115 స్థానాల్లో పార్టీ అభ్యర్థులను భర్తీ చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్ దూకుడు పెంచింది. గత ఎన్నికల్లో చేసిన తప్పులను పునరావృతం కాకుండా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అభ్యర్థులను డిక్లేర్ చేయడంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఈ నెలాఖరులోగా 80 మంది అభ్యర్థులతో ఫస్ట్ లిస్ట్ రిలీజ్ చేసేందుకు సిద్ధమైంది. కర్ణాటక విజయంతో ఎన్నికలకు ముందు అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్ ఆ దూకుడును కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంది. ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకుంటుంది. ఇప్పటికే మాజీ ఎంపీ పొంగిలేటి, మాజీ మంత్రి జూపల్లి సహా కీలక నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా తాజాగా

..మిగతా | 2 | లో

## కాంగ్రెస్ ఏం చేసిందో కేసీఆర్‌కు తెలియదా

### - కేసీఆర్ రాజకీయ జీవితం ప్రారంభమైంది ఆ పార్టీ నుంచే కదా!
### - ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశాలభారతి,హైదరాబాద్:** ఇటీవల సీఎం కేసీఆర్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గత 50 ఏండ్లలో ఏం అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. కాగా తాజాగా కేసీఆర్ కు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్ పార్టీతో అని చెప్పారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో కేసీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. సూర్యాపేట సభలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలతో పాటు, బీఆర్ఎస్ మొదటి విడత అభ్యర్థుల జాబితాపై వెంకటరెడ్డి స్పందించారు. కేసీఆర్ రాజకీయ జీవితం మొదలైంది కాంగ్రెస్ పార్టీ నుంచేనని, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనే అని కేసీఆర్‌కు తెలియదా? అని ఎద్దేవా చేశారు.
కర్ణాటకలోని కూర్గ్‌లో జరుగుతున్న బొగ్గు గనులు, ఉక్కు ఆధారిత పరిశోధన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లో కోమటిరెడ్డి మాట్లాడారు. గత 50ఏళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ఆయన వివరించారు. కేసీఆర్ ప్రకటించిన 115 మంది అభ్యర్థుల ఆస్తులు.. ఎమ్మెల్యేలు కాకముందు ఎంత, అయ్యాక ఎంత పెరిగిందనే వివరాలు సేకరించి సోషల్ మీడియాలో షేర్ చేయాలని కార్యకర్తలు, ఉద్యమకారులు, నిరుద్యోగులకు పిలుపునిచ్చారు.



## బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ఎప్పుడు పూర్తి చేస్తరు?

### బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు.డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

### - అన్ని పార్టీలు బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్

**నారాయణఖేడ్, విశాల భారతి :** బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నారాయణఖేడ్ పట్టణంలో మంగళవారం బహుజన శక్తి ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.నారాయణఖేడ్ ప్రాంతంలో సాగునీరు అందక వేలాది మంది వలసలు వెళ్తున్నారని అన్నారు.బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శిలాఫలకాలకే పరిమితమైందని విమర్శించారు. జనాభాలో కేవలం ఒక్క శాతం ఉన్న వెలమ సామాజిక వర్గానికి కేసీఆర్ 11 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించి,జనాభాలో ఉన్న 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 23 అసెంబ్లీలు

..మిగతా | 2 | లో



## మల్లా' రాజిరెడ్డి క్షేమం

### మావోయిస్టు పార్టీ స్పష్టత.. చనిపోలేదని ప్రకటన

### దండకారణ్యం ఉత్తర్ సబ్ జోనల్ బ్యూరో వెల్లడి

**హైదరాబాద్ ,విశాలభారతి:** మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి (70) అలియాస్ సాయన్న మృతి చెందినట్లు జరిగిన ప్రచారంపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన విడుదల చేసింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్పూర్ పరిధిలోని శాస్త్రులపల్లికి చెందిన రాజిరెడ్డి, సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలగుంటపల్లికి చెందిన తొలితరం మావోయిస్టు నేత కట్టా రామచంద్రారెడ్డిలో ఒకరు చనిపోయినట్లు ప్రచారం చేశారు. ఈ ప్రచారం వెనక కేంద్ర ఇంటలీజెన్సీ వర్గాల పాత్ర ఉందనే కోణంలోనూ విమర్శలు వచ్చాయి. రాజిరెడ్డి లేదా రామచంద్రారెడ్డిలో ఒకరు మృతి చెందారని, వారి దహన సంస్కారాలను మావోయిస్టుచపార్టీ దండకారణ్యంలోనే పూర్తి చేసిందని ఒక వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో రాజిరెడ్డి మృతిపై సస్పెన్షన్ కొనసాగింది. ఇదే సమయంలో కట్టా రామచంద్రారెడ్డి పేరు కూడా చర్చల్లోకి వచ్చింది. చనిపోయింది రామచంద్రారెడ్డి అని మరో ప్రచారం వచ్చింది. దీంతో అసలు చనిపోయిన మావోయిస్టు నేత ఎవరు అనేది ఇప్పటి వరకు ఎటూ తేలకుండా ఉంది.

**అగ్రనేతలు మృతి చెందలేదు**
మావోయిస్టు పార్టీ అగ్రనేతలు రాజిరెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి ఎవరూ మృతి చెందలేదని, వారంతా క్షేమంగా ఉన్నారని మావోయిస్టు పార్టీ వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం మావోయిస్టు పార్టీ దండకారణ్యం ఉత్తర్సబ్ జోనల్ బ్యూరో పేరుతో ఈ లేఖను విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్స్ మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), కట్టా రామచంద్రారెడ్డి మరణించినట్లుగా వచ్చిన వార్తా కథనాలు అవాస్తవమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇద్దరు నాయకులు క్షేమంగా, సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. ప్రజలను ఆయోమయంలో మంచెత్తడానికి, విప్లవ విజయం పట్ల అవిశ్వాసం కల్గించడానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసు, ఇంటలీజెన్సీ ఉన్నత అధికారుల కనుసన్నల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత అనారోగ్యాల పట్ల మీడియాలో అబద్ధపు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇది పాలకవర్గాల మానసిక యుద్ధంలో భాగమేనని, ఈ దుష్ప్రచారాలను నమ్మవద్దని ఉత్తర్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి మంగ్లి పేరుతో మావోయిస్టు పార్టీ ప్రకటన విడుదల చేసింది.



## భవిష్యత్‌లో ఇంటింటికీ మద్యం

- రాష్ట్రంలో ఊరికి 10 బెల్ట్ షాపులు
- పార్టీ ఆదేశిస్తే జగిత్యాల నుంచి పోటీ చేస్తాం
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్ లో ఇంటింటికీ మద్యం పంపిణీ చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఊరికి 10 బెల్ట్ షాపులు పెట్టినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ పై సెటైర్లు వేశారు. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ సంస్థలు ఉన్నట్లుగానే భవిష్యత్తులో మద్యం డెలివరీ సంస్థలు కూడా ఏర్పడతాయని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో మద్యం ఇంటికి డెలివరీ అయ్యేలాగా వ్యవస్థ ఏర్పడుతుందని ఎద్దేవా చేశారు. ఇలాంటి సౌకర్యాలు కల్పించబోయే ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమేనని, ఆ బ్రాండ్ కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వానికి ఆదాయం తేవడానికి ఊరికో బెల్టు షాప్ పెట్టారని అన్నారు. ఎక్సైజ్ పోలీసులకు టార్గెట్లు పెట్టి మరీ మద్యం అమ్ముతున్నారని

..మిగతా 2 లో

www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi
Telugu Daily

విశాల భారతి



## కామారెడ్డి నుంచి పోటీ వెనుక గులాబీబాస్

# మాస్టర్ ప్లాన్..?

**మొదటిపేజీ తరువాయి**

నెలకొనే అవకాశాలు ఉన్నాయని పొలిటికల్ అనలిస్టులు చెబుతున్నారు. సీఎం అక్కడి నుంచి నిలబడితే మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఆ ప్రభావం ఉంటుందనేది ఒక అభిప్రాయం వ్యక్తమవుతోంది. కామారెడ్డి పరిధిలో పోటీ చేయడం ద్వారా 4 పార్లమెంట్ స్థానాలతోపాటు 30కిపైగా అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం చూపొచ్చని కేసీఆర్ భావిస్తున్నారని గులాబీ పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి.

**మరిన్ని మార్పులు తథ్యం**

దుబ్బాక, స్టేషన్‌ఘన్‌పూర్, ఉప్పల్, వైరా, ఖానాపూర్, వేములవాడ, కామారెడ్డి, బోథ్, కోరుట్ల నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చారు కేసీఆర్. మొన్నటివరకు రాజయ్యకే సీటు అన్న గులాబీ బాస్.. అనుహ్యంగా కడియానికి సీటిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను ఎంపీగా నిలబెడుతారని తాజాగా ప్రచారం జోరందుకుంది. ఇంకా ప్రకటించని నాలుగు స్థానాల్లో నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టినా ఎంఐఎం ముందు అవి ఉత్తవే. అక్కడ పరోక్షంగా మజ్లిస్ పార్టీకి అనుకూలంగా అభ్యర్థులను నిలబెట్టుడు నామమాత్రమే. ఆయా స్థానాల్లో ఎవరూ ఎక్కువగా ఓట్లను చీల్చుతారో అదే ఆ అభ్యర్థుల ప్రధాన అర్హత. ఇక జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సాపూర్‌లో సునీత లక్ష్మారెడ్డి బరిలోకి దిగడం దాదాపు ఖాయమంటున్నారు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు. టికెట్లు దక్కని వారు నిరాశపడవద్దని రాజకీయ జీవితమంటే ఎమ్మెల్యేగా పనిచేయడమే కాదని, ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎంపీ ఇలా అనేక అవకాశాలు ఉంటాయని సీఎం చెప్పినా.. కొందరు వ్యతిరేకించారు. కాంగ్రెస్, బీజేపీలో త్వరలోనే చాలామంది నాయకులు చేరే అవకాశం ఉందని తెలుస్తోంది.

**మహేందర్ రెడ్డికి మంత్రి పదవి వ్యూహామే**

తాండూరు నుంచి తానే పోటీ చేస్తానని పార్టీపై ధిక్కార స్వరం వినిపించిన మాజీ మంత్రి మహేందర్ రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారు. పాత రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలోని 29 స్థానాల్లో బీఆర్ఎస్, మజ్లిస్ గెలుస్తాయని సీఎం అంచనా వేస్తున్నారు. మహేందర్‌రెడ్డిని తీసుకుంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టు నిలుపుకోవచ్చని గులాబీ బాస్ అంచనా వేస్తున్నారు. మరోవైపు ఆసరా పింఛన్లు పెంచుతామని ఇటీవల ప్రకటించారు సీఎం. ఈ ఒక్క స్థానాన్నే భర్తీ చేస్తారా? ఇంకా ఏమైనా మార్పులు చేస్తారా అన్నది చూడాలి. అలాగే రాబోయే మరిన్ని తాయిలాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

# గంజాయికి అడ్డాగా హైదరాబాద్

- **పోలీసులు ఏం చేస్తున్నారు?**
- **ఇలాంటి పాలనపై జనం తిరగబడాలి**
- **పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్వీట్**



**విశాలభారతి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారిందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయిస్తుంటే పోలీసులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రభుత్వంపై జనం తిరగబడాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. ఏం ట్వీట్ చేశారంటే.. "విశ్వనగరం చేశానని కేసీఆర్ గప్పాలు కొట్టే మన హైదరాబాద్... బీఆర్ఎస్ పాలనలో గంజాయికి, మత్తు పదార్థాలకు అడ్డాగా మారింది. నిన్న సింగరేణి కాలనీలో, నేడు మీర్‌పేటలో ఆడబిడ్డలపై అఘాయిత్యాలు కలచివేస్తున్నాయి. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని ప్రజల మానప్రాణాలను గాలికి వదిలేశారు. ఇలాంటి పాలనపై "తిరగబడదాం తరిమికొడదాం". అంటూ రేవంత్ ట్వీట్ చేశారు. మీర్‌పేటలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. కొందరు యువకులు ఇంట్లోకి దౌర్జన్యంగా వెళ్లి బాలికను ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ప్రతిపక్ష పార్టీల నేతలు ఆందోళనలు చేపట్టారు. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## భవిష్యత్‌లో ఇంటింటికీ మద్యం

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించారు. సమాజాన్ని మద్యానికి బానిసలు చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య ఆలోచనా విధానామని జీవన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం పేదవారి నుంచి రూ.లక్షల కోట్ల రూపాయలు దోచుకుంటుందని, మద్యం తాగే వాళ్ళ పొట్ట కొడుతుందని మండిపడ్డారు. మద్యంతో సమాజాన్ని బానిసలు చెయ్యొద్దని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎన్నికల్లో పోటీపై ఇటీవలే కీలక వ్యాఖ్యలు**

మరో నాలుగు నెలల్లో తెలంగాణకు అసెంబ్లీ ఎన్నికలు రానున్న వేళ జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడంపై జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడ ప్రత్యామ్నాయం ఎవరూ లేరు కాబట్టి, ఆ బాధ్యత తనపై పడే అవకాశం ఉందని అన్నారు. అయితే, ఎన్నికల్లో పోటీ చేయాలంటే ధైర్యం కావాలని, గతంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవని జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే అంశం ఇంకా ఖరారు కాలేదని అన్నారు. హైకమాండ్ మాత్రం ఆ బాధ్యత తనపై పెడుతుందని జీవన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తాను ఆరోగ్యంగా ఉన్నందునే, పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తానని అన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో జగిత్యాల అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తే జగిత్యాల ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. తాను ఎన్నికల్లో ఓడినా గెలిచినా ఇంతకాలం ప్రజల మధ్యనే ఉన్నానని అన్నారు. ఇకముందు కూడా అలాగే ఉంటానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్పారు.





# ప్రజాగ్రహంలో జగన్ కొట్టుకుపోతారు

- **పందికొక్కులా ఇసుక తింటుంది ఎవరు?**
- **కృష్ణా జిల్లాలో ఎందుకూ పనికిరాని నలుగురు మంత్రులు అయ్యారు**
- **గన్నవరం బహిరంగ సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్**

**విశాలభారతి, ఏపీ బ్యూరో:** ఇసుక దందాలో సీఎం జగన్ రోజుకు రూ.3కోట్లు చొప్పున అక్రమంగా సంపాదిస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. యువగళం పాదయాత్రలో భాగంగా గన్నవరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక, సిమెంట్, ఐరన్ ఛార్జీలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యమాల వాడ బెజవాడ ప్రజల ఆగ్రహంలో జగన్ కొట్టుకుపోతారన్నారు. యువగళం చూసి జగన్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. యువగళానికి వచ్చిన స్పందన చూసి జగన్‌కు భయం పట్టుకుందన్నారు. పవిత్రమైన కృష్ణా జిల్లాలో పాదయాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. సుబాబుల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. మామిడి, పత్తి, మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకుంటాం. పెడన చేనేత కార్మికులని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తాం. మచిలీపట్నం వాసుల చిరకాల స్వప్నం బందర్ పోర్టు పనులను పూర్తి చేస్తాం. కృష్ణాడెల్టా చివరి ఆయకట్టు వరకు రైతాంగానికి సాగునీరు అందిస్తాం. విజయవాడ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మిస్తాం. రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేస్తాం. టిడిపి కార్యకర్తల్ని వేధించిన ఏ ఒక్కరిని వదిలిపెట్టను. వడ్డీతో సహా చెల్లిస్తా. పార్టీ కోసం కష్టపడిన వారిని గుండెల్లో పెట్టుకుంటా. టిడిపి నాయకులు, కార్యకర్తల్ని వేధించిన వారు కృష్ణా జిల్లా లో ఉన్నా విదేశాలకు పారిపోయినా పట్టుకొచ్చి లోపలేస్తాం. చట్టాలు అతిక్రమించి వ్యవహరించిన అధికారులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని లోకేష్ స్పష్టం చేశారు.

## ప్రకాశ్ రాజ్ పై కేసు

**మొదటిపేజీ తరువాయి**

ప్రకాశ్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలంటూ కొందరు హిందూ సంస్థల ప్రతినిధులు డిమాండు చేశారు' బాగల్‌కోట్‌లోని బనహట్టి పోలీసులు వెల్లడించారు.

ఇదిలాఉంటే, చంద్రయాన్3 ప్రయోగం కీలక దశకు చేరిన సమయంలో... 'విక్రమ్ ల్యాండర్ చంద్రుడి నుంచి పంపుతున్న మొదటి ఫొటో' అనే వ్యాఖ్యకు ఒక వ్యక్తి టీ తయారు చేస్తున్న ఫొటోను జోడించి ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు. ఇది తమ నాయకుడిని ఉద్దేశించే పోస్టు చేశారని కొందరు విమర్శించగా.., దేశ ప్రగతి, ప్రతిభను సహించలేక ప్రకాశ్‌రాజ్ ఇలా స్పందించారని మరికొందరు నెటిజన్లు దుయ్యబట్టారు.

# స్నేహా 'హస్తాలు'

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్లో టికెట్రాకపోవడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్హస్తం గూటికి చేరారు.

అయితే, ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి అప్లికేషన్లు తీసుకుంటున్న కాంగ్రెస్.. ఏకాభిప్రాయం కుదిరిన నియోజకవర్గాల్లో ముందుగానే అభ్యర్థులను ప్రకటించనున్నది. ఈ నెల చివరి వారం కల్లా అభ్యర్థులను ప్రకటించేందుకు కుస్తీలు పడుతున్నారు. ఆ తర్వాత పోటీ ఉన్న నియోజకవర్గాల్లో సయోధ్య కుదిర్చి అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలుస్తున్నది. వాస్తవానికి గత ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే ముందే టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో జాప్యం అధికార పార్టీకి కలిసొచ్చిందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. అయితే, గులాబీ పార్టీ కంటే ముందే అభ్యర్థులను ప్రకటించాలని కాంగ్రెస్ భావించినప్పటికీ.. సిట్టింగ్లకు సీట్ల కేటాయింపులపై ఆచితూచీ వ్యవహరించింది. అనుకున్నట్టే సిట్టింగ్లకు దాదాపుగా సీట్లు ఇచ్చారు. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్లో అసంతృప్తి వెల్లడవుతున్నది. ఇదే సమయాన్ని కాంగ్రెస్ క్యాచ్ చేసుకోవాలని భావిస్తున్నది.

**టచ్లోకి ఉద్యమ నేతలు**

బీఆర్ఎస్లో మొన్నటిదాకా టికెట్ల ఆశలు పెట్టుకున్న ఆశావాహులు ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. స్థానికంగా ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత ఉండటంతో.. అభ్యర్థుల మార్పు ఉంటుందని ఆశలు పద్దారు. అంతేకాకుండా పలు సర్వే సంస్థలుకూడా కొంతమంది ప్రత్యామ్నాయ నేతలకు చాన్స్ ఉంటుందని తేల్చాయి. కానీ, సిట్టింగ్లకే మళ్లీ అభ్యర్థిత్వం ఖరారు చేయడంతో పలువురు ఆశావాహులు ఖంగు తిన్నారు. ఉద్యమం నుంచి పార్టీ జెండా మోస్తున్నా.. కనీసం ప్రాధాన్యత ఇవ్వడం లేదని మధనపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యామ్నాయ వేదిక కోసం కాంగ్రెస్ వైపు తిరుగుతున్నారు. అయితే, స్థానికంగా పోటీ ఉంటుందనే భయంతో ఢిల్లీ పెద్దల నుంచి క్లియరెన్స్ తీసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**కాంగ్రెస్తో కామ్రేడ్లు..?**

రాష్ట్రంలోని వామపక్షాలకు కేసీఆర్ షాక్ ఇచ్చారు. కనీసం చేరో నాలుగు స్థానాలు కావాలని వామపక్షాలు.. కేసీఆర్ ముందు ప్రతిపాదనలు పెట్టాయి. ముందుగా చేరో 6 నుంచి 8 స్థానాలు కోరడంతో.. ఎక్కువ సీట్లు కోరుతున్నట్లు బీఆర్ఎస్ వర్గాల నుంచి టాక్ రావడంతో.. వామపక్షాలు సీట్ల సంఖ్యను తగ్గించాయి. చివరకు చేరో నాలుగు స్థానాలకు పరిమితమయ్యాయి. కొత్తగూడెం, వైరా, బెల్లంపల్లి, మునుగోడు నియోజకవర్గాలను సీపీఐ కోరింది. అదే విధంగా ఖమ్మం, పాలేరు, భద్రాచలం, మిర్యాలగూడ అసెంబ్లీ స్థానాలను సీపీఎం అడిగింది. కానీ, వీటిని బీఆర్ఎస్ అధినేత పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మంగళవారం సీపీఐ, సీపీఎం అత్యవసరంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశాల్లోనే కాంగ్రెస్ తో దోస్తీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కటై ఇండియా పేరుతో ఉన్న పార్టీల్లో వామపక్షాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ కూటమితో కలిసిపోయేందుకు సిద్ధమవుతున్నాయి.



# తాండూర్ నుండి అవకాశం ఇవ్వండి

- **దరఖాస్తు చేసిన పీసీసీ జనరల్ సెక్రటరీ పట్లోళ్ళ రఘువీర్ రెడ్డి**

**హైదరాబాద్, విశాల భారతి :** తాండూర్ నియోజక వర్గ అసెంబ్లీ అభ్యర్థిత్వం కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ రఘువీర్ రెడ్డి ఈ రోజు గాంధీ భవన్ టిపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి లో దరఖాస్తు దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాండూర్ నియోజక వర్గ ప్రజలు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఆమోదం, సహకారం మరియు పార్టీ అధిష్టానం ఆశీస్సులతో నాకు అవకాశం ఇస్తే తాండూర్ నియోజక వర్గ అభ్యర్థిగా పోటీ చేస్తానని పేర్కొన్నారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్ సామాన్య కార్యకర్త నుండి ప్రారంభం అయిన నా రాజకీయ జీవితం నేడు పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి వరకు ఎదగడానికి కార్యకర్తల కృషి, నాయకుల సహకారం ఉందని, భవిషత్తు లో అదే విధమైన సహకారం ఉండాలని అన్నారు.

# పింఛన్...ఓట్లు పంచెన్...

## బీఆరెస్, కాంగ్రెస్‌లకు ఇవే ఇప్పుడు ప్రధాన అస్త్రాలు...
## నాలుగువేల పింఛన్ ఇస్తామని రేవంత్ మళ్లీ ప్రకటన...
## సూర్యాపేట సభలో పింఛన్లు పెంచనున్నామని హింట్ ఇచ్చిన కేసీఆర్....
## అందరి దృష్టి పింఛన్ పెంపుపైనే....
## మ్యానిఫెస్టోలో ఇదే ప్రధానం కానుందా..??



**నిజామాబాద్, విశాలభారతి:** ఎన్నికలకు ఇంకా రెండు మూడు నెలల సమయం ఉంది. కానీ మ్యానిఫెస్టోలో లేని చెప్పని కొత్త పథకాలు ఇప్పట్నుంచే పుట్టుకొస్తున్నాయి. రోజుకొకటి చొప్పున ప్రకటించేస్తున్నారు. ప్రధానంగా ఆ సారి అధికార పార్టీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ బలం పుంజుకుంటున్నది. దీంతో మొన్న సభలో రాహుల్ వితంతువులు, వృద్ధులకు నాలుగు వేల పింఛన్ ఇస్తామని ప్రకటించి వెళ్లిపోగానే ఇదో చర్చ అయ్యింది. చాలా రోజుల తర్వాత తాజాగా సూర్యాపేట బహిరంగ సభలో సీఎం కేసీఆర్ కూడా పింఛన్ల పెంపుపై క్లారిటీ ఇచ్చాడు. ఎవరో చెప్పిన మాటలు వినొద్దు. మనం రెండు వందలున్న పింఛన్‌ను రెండు వేలకు పెంచినం..అంటూ చెప్పుకొచ్చారు. మూడు వేలుగా ఉన్న పింఛన్‌ను నాలుగు వేలు చేస్తామని ఇప్పటికే కేసీఆర్ ప్రకటించిన విషయం తెలసిందే. సూర్యాపేట సభలో మనం ఇంకా పెంచుతాం.. మ్యానిఫెస్టోలో ప్రకటిస్తాం అని చెప్పగానే ఆశలు పెరిగాయి జనాలకు. ముందే కేసీఆర్‌కు చేతికి ఎముకుండ దంటారు. ఆయన పథకాల అమలు తీరు చూస్తే ప్రతిపక్షాలకు కళ్లు బైర్లు కమ్మాల్సిందే. అలాంటిది పింఛన్ పెంచబోతున్నామని చెప్పేసరికి ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోయాయి జనాల్లో. ఎందకంటే... అత్యధికం గా ఓట్ల శాతం బీఆరెస్‌కు ఆసరా పింఛన్ దారులవే. అవే ఆ పార్టీకి శ్రీరామ రక్షగా ఉన్నాయి. మరి అలాంటి ఓటుబ్యాంకును మధ్యలో వచ్చి కాంగ్రెస్ కొల్లగొడతా నంటే కేసీఆర్ చూస్తూ ఊరుకుంటాడా..? అందుకే ఒక లీక్ వదలాడు. అప్పుడే జనాలు కాంగ్రెస్ హామీల పట్ల టెంప్ట్ కావొద్దని. కానీ తాజాగా రేవంత్‌రెడ్డి ... రాహుల్‌ను మించి మరో ప్రకటన చేశాడు పింఛన్లపై. వింతంతువులు, వృద్ధులే కాదు.. బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వికలాంగులు... ఇలా అందరికీ నాలుగు వేల పింఛన్ ఇస్తామని ప్రకటించేశాడు. ఏ నిర్ణయం తీసుకున్నా ఢిల్లీ పెద్దల అనుమతి లేనిదే ఇక్కడి నేతలకుసాధ్యం కాదు. మరి రేవంత్ ఇలా ప్రకటన చేయడం వెనుక మతలబేమిటి..? కేసీఆర్ వ్యూహాన్ని దెబ్బతీయడం ప్రధాన ఉద్దేశ్యమా..? అధిష్టానాన్ని ఎలాగోలా ఒప్పించవచ్చనా..? ముచ్చటేదైనా.. ఇప్పుడు పింఛన్ల పెంపు ఎంత.. ఎవరెంత..? అనేదే అసలైన చర్చ అయి కూర్చుంది. ఎందుకంటే ఓట్లు పంచే వాటిలో ఈ పింఛన్‌ల పాత్రే ఎక్కువ మరి.



## గట్టుఇప్పలపల్లిని మండలంగా గుర్తించాలని నిరసన


**అమనగల్లు,విశాలభారతి:** తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. సమావేశంలో మండల కేంద్రంగా గుర్తించాలని వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, గట్టు ఇప్పలపల్లి సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, వీరన్న పల్లి సర్పంచ్ నాగమణి లింగం గౌడ్, కోరంతకుంట తాండ సర్పంచ్ రాములు నాయక్, వెంకట్రావుపేట్ సర్పంచ్ హైమావతి డిమాండ్ చేశారు

## బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్

# ఎప్పుడు పూర్తి చేస్తరు?

**మొదటిపేజీ తరువాయి**


మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు.రాష్ట్రంలో బీసీలకు జనాభా ప్రాతిదికన 70 అసెంబ్లీ స్థానాలు కేటాయించే ఏకైక పార్టీ బీఎస్పీనేనన్నారు. గోదావరి జలాలను తన ఫామ్ హౌస్ కు మళ్ళించడం కోసమే ముఖ్యమంత్రి కేసీఅర్ కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్మించుకున్నారు తప్ప, నారాయణఖేడ్ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి కొట్లాడింది బహుజనులు అయితే అధికారం దక్కింది మాత్రం కల్వకుంట్ల కుటుంబానికేనని ఆరోపించారు.రాష్ట్రంలో మెజారిటీ ప్రజలకు రాజ్యాధికారం అందించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. హైదరాబాద్ నగరంలో బస్సుకోసం అర్ధరాత్రి రోడ్డుపై నిలబడితే గిరిజన మహిళ లక్ష్మీని ఎల్బీనగర పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగించి లాఠీలతో చితకబాదారన్నారు. కేసీఅర్ కూతురు కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో రూ.100 కోట్లు ముడుపులు చెల్లిస్తే ఈడీ అధికారులు ఆమె ఇంటికి వెళ్ళి రాచమర్యాదలతో విచారించారని ఆరోపించారు.ఖదీర్ ఖాన్, మరియమ్మ లను దొంగతనం చేశారనే అనుమానంతో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి,థర్డ్ డిగ్రీ చేయడం వల్లనే లాకప్ డెత్ లు అయ్యారన్నారు. పోలీసులు కేవలం బహుజనుల మీదనే దాడులకు పాల్పడుతున్నారు. హైదరాబాద్



పాత బస్తీకి చెందిన షేక్ సయీద్ బావజీర్ తన హత్యకు ముందే హోం మంత్రికి మహమూద్ అలీకి ఫోన్ ద్వారా హంతకులపై ఫిర్యాదు చేసిన అతని ప్రాణాలను కాపాడడంలో హోంమంత్రి, పోలీసులు విఫలమయ్యారన్నారు. బీఅర్ఎస్ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే హోంమంత్రిని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీకి వేలాది మంది బహుజనులు కదం తొక్కారు. ర్యాలీకి ముందు భవానీ మందిర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మొదలైన ర్యాలీ డా.బి.అర్.అంబేద్కర్ చౌక్,ఛత్రపతి శివాజీ చౌక్ మీదుగా రెహమాన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకూ కొనసాగింది.ఈ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయిని ఈశ్వర్,జిల్లా ఇంచార్జీలు ప్రేమ్ కుమార్, మోహన్,జిల్లా అధ్యక్షులు నటరాజ్,ప్రధాన కార్యదర్శి మల్లేశ్ గౌడ్,అసెంబ్లీ ఇంచార్జ్ పండరి, భీమయ్య పాల్గొన్నారు.

# '48 గంటల్లో వివరణాత్మక నివేదిక ఇవ్వండి'

- **మీర్‌పేట్ ఘటనపై పోలీసులకు గవర్నర్ ఆదేశాలు**
- **కుటుంబానికి అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాలని సూచన**



**హైదరాబాద్ ,విశాలభారతి:** హైదరాబాద్ మీర్పేట్లోని మైనర్ బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆరాతీశారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తమిళిసై.. 48 గంటల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రాచకొండ పోలీస్ కమిషనర్ సీపీ చౌహాన్కు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రతినిధులు తక్షణమే బాధితురాలి నివాసానికి వెళ్లి ఆమె కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాలని గవర్నర్ సూచించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను ప్రభుత్వం తక్షణమే కఠినంగా శిక్షించాలంటూ కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు మీర్పేట్ వద్ద ఆందోళనకు దిగాయి. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, ఆకతాయిల ఆగడాల గురించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. కీచకులకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# కేసీఆర్ కు ఓటమి భయం పట్టుకుంది

- అందుకే గజ్వేల్, కామారెడ్డి రెండు చోట్ల పోటీ.
- మందుమూత విప్పకుండానే 2వేల కోట్లు కొట్టేశారు.
- షాద్ నగర్ లో బీసీ డిక్లరేషన్ సభను 3 లక్షల మందితో నిర్వహిస్తాం
- షాద్ నగర్ మీడియా సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు

**షాద్ నగర్,విశాలభారతి:** దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా చెప్పుకునే సీఎం కేసీఆర్ కు వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని అందుకే గజ్వేల్, కామారెడ్డి రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంత రావు (వీహెచ్) అన్నారు. మంగళవారం షాద్ నగర్ పట్టణంలో వచ్చే నెల జరుపబోయే కాంగ్రెస్ బిసి డిక్లరేషన్ సభకు సంబంధించి స్థల పరిశీలన కోసం ఇక్కడికి వచ్చారు. టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో స్థానిక వి కన్వెన్షన్ హాల్ వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మీడియా సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడిస్తారని భయంతోనే గజ్వేల్ లో గెలిచే పరిస్థితి లేనందున తన పరువు కాపాడుకోవడానికి సీఎం కేసీఆర్ కామారెడ్డిలో కూడా పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజల్లో ఎంతో మార్పు వచ్చిందని అన్నారు. రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ సభ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని అన్నారు.బీసీ క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని వి.హనుమంత రావు పేర్కొన్నారు. ఓబీసీకి ప్రత్యేక మినిస్ట్రీ అవసరం ఉందని అన్నారు. 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ తొలగించాలన్నారు. బీసీ వ్యక్తి ప్రధాన మంత్రిగా ఉండి బీసీలకు న్యాయం చేయలేకపోతున్నాడని మోదీని విమర్శించారు. అందుకే దేశంలో ఓబీసీ క్యాస్ట్ వైస్ జనగణన జరగాలన్నారు. పబ్లిక్ సెక్టార్ యూనిట్ లని ప్రైవేటు చేయడం మానేయాలన్నారు. అంతేగాక ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. జ్యూడిషియల్, ప్రైవేట్ సెక్టార్ రిజర్వేషన్లు ఓబీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేలా చొరవ చూపాలన్నారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీకి సాధ్యం అవుతుందని అన్నారు. బీసీల తడాఖా చూపించడానికి వచ్చేనెల షాద్ నగర్ పట్టణంలో బీసీ డిక్లరేషన్ సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కనీసం మూడు లక్షల మంది బడుగు బలహీన వర్గాల ప్రజలు సమీకరణ చేసే విధంగా ఈ సభ ఉంటుందని అన్నారు. బీసీల ఐక్యత చూపకపోతే మరో ముప్పై ఏళ్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా బీసీల పరిస్థితి మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**కేసీఆర్ కు "మందుచూపు" చాలా ఎక్కువ**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఖజానా నింపుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త అవతారం ఎత్తారని హనుమంతరావు అన్నారు. మందు సీసా విప్పకుండానే రాష్ట్ర ఖజానాకు రెండువేల కోట్లు సమకూర్చారని కేసీఆర్ కు "మందుచూపు" చాలా ఎక్కువని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల కోసం సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఎంపిక చేయడం వెనుక కేసీఆర్ భయం ఉందని అన్నారు. సిట్టింగులకు టికెట్లు ఇవ్వకపోతే కేసీఆర్ ను ఎదిరించే స్థాయిలో ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం జరగకుండా పరువు పోకుండా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చారని అన్నారు. పార్టీ వీడుతారని భయపడి పట్నం మహేందర్ రెడ్డికి మంత్రి పదవి కట్టబెడుతున్నారని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారని ఓటమికి భయపడి ఇదంతా జరుగుతుందని అన్నారు.

**బిసి డిక్లరేషన్ సభకు స్థల పరిశీలన**

బిసి డిక్లరేషన్ సభను వచ్చేనెల షాద్నగర్ పట్టణంలో పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నట్టు హనుమంతరావు ప్రకటించారు. దీనికోసం స్థల పరిశీలన చేస్తున్నట్టు చెప్పారు. పట్టణంలోని బాలాజీ టౌన్షిప్ ఎదురుగా పార్కింగ్ స్థలంతో పాటు అదేవిధంగా ఆ పక్కనే పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు వేదిక స్థలం పరిశీలించినట్లు చెప్పారు. ఈ మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, పిసిసి జాయింట్ సెక్రెటరీ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ నేతలు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కొంకల్ల చెన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, అందెమోహన్, పురుషోత్తంరెడ్డి, రాజు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గ ప్రజలు తలెత్తుకొని గర్వంగా చెప్పుకునేలా మరింత అభివృద్ధి చేసి చూపిస్తా

- రాష్ట్రంలో కేసిఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డ్ సృష్టించనున్నారు
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**బాల్కొండ,విశాలభారతి:** రాష్ట్రంలో కెసిఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డ్ సృష్టించనున్నారని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.సీఎం కేసిఆర్ బిఆర్ఎస్ పార్టీ టికెట్ ప్రకటించిన తర్వాత మొదటి సారి బాల్కొండ నియోజకవర్గానికి వచ్చిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి బాల్కొండ నియోజకవర్గ బిఆర్ఎస్ శ్రేణులు గజమాలతో అఖండ స్వాగతం పలికారు.పేర్కిట్,లక్కోరా, వేల్పూర్,భీమ్‌గల్,కమ్మర్ పల్లి,మోర్తాడ్ మీదుగా దారి పొడవునా అడుగడుగునా అభిమానులు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.తమ అభిమాన నాయకుడు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి వరుసగా మూడో సారి పార్టీ టికెట్ కేటాయించినందుకు సీఎం కేసిఆర్ కి దన్యవాదాలు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి,వేల్పూర్ X రోడ్ లో రైతు నాయకుడు స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలే నా బలం బలగం అని అన్నారు.నాపై ఎంతో నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన కేసీఆర్ కి ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలో కెసిఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డ్ సృష్టించనున్నారని అన్నారు.ప్రజల నిరాజనం చూస్తుంటే కేసీఆర్ పై నాపై ఉన్న నమ్మకం ఏంటో అర్థమవుతుందని తెలిపారు.డబ్బుతో ఈ ప్రేమను కొనలేరు.సీఎం కేసిఆర్ ఒక్కరు ఒకవైపు బిజెపి కాంగ్రెస్ ఇతర దుష్టశక్తులు మరోవైపు అని చెప్పారు.ఎవరిని ప్రయత్నాలు చేసినా ఈసారి కూడా బిఆర్ఎస్ దే ఘనవిజయం అని తెలిపారు.19వేల కోట్లతో రుణమాఫీ చేసిన దమ్మున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు.మ్యానిఫెస్టోలో లేని ఎన్నో పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేశారన్నారు.అందుకే సీఎం కేసిఆర్ పై ప్రజలకు ప్రగాఢ విశ్వాసం అని అన్నారు.ఇక ఈ మధ్యన ఓటమి భయంతో నాపై కొంతమంది దృష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.ప్రతిపక్షాలు చిల్లర ప్రయత్నాలు మానుకోవాలని సూచిస్తున్న అని చెప్పారు.వేల కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాను. ప్రజల ఆశీర్వాదంతో ఈ అభివృద్ధిని కొనసాగిస్తానని తెలిపారు.అపూర్వ స్వాగతం పలికిన నియోజకవర్గ ప్రజలకు,నా బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

**డ్రైవింగ్ లైసెన్స్ లు అందజేత......**

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో ఇటీవల లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం లోని అన్ని గ్రామాల యువతి యువకులందరికి మోర్తాడ్ గ్రామ ఆర్.ఎన్.బి ఫంక్షన్ హాల్ లో సుమారు 1092 మంది యువతి యువకులకు లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు.




# ఆదిత్య కన్స్ట్రక్షన్స్ కు వ్యతిరేకంగా కార్మికుల ఆందోళన

- బకాయి పడ్డ బిల్లులు అడిగేందుకు వచ్చిన వారిపై బౌన్సర్లతో దాడి
- ఆదిత్య కన్స్ట్రక్షన్ కు వ్యతిరేకంగా పెద్దపెట్టను నినాదాలు
- ఆదిత్య కన్స్ట్రక్షన్స్ ముందు సాయి తిరుమల కన్స్ట్రక్షన్స్ నిర్వాహకులు,వలస కార్మికుల బైఠాయింపు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో భారీ నిర్మాణ సంస్థ ఆదిత్య కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కన్స్ట్రక్షన్ వద్ద సాయి తిరుమల కన్స్ట్రక్షన్స్ నిర్వాహకులు,వలస కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు.ఆదిత్య కన్స్ట్రక్షన్స్ కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సాయి తిరుమల కన్స్ట్రక్షన్స్ యాజమాన్యం, వలస కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన తమకు బకాయి పడ్డ బిల్లులు అడిగేందుకు వచ్చిన తమపై భౌన్సర్లను పెట్టి దాడి చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆదిత్య కన్స్ట్రక్షన్స్ లో సుమారు రూ. 50 కోట్ల మీద పెట్టుబడి పెట్టి నిర్మాణాలు చేపట్టామన్నారు.ఎంతో కష్టపడి ప్రాజెక్టు కొనసాగించామని తీరా కన్స్ట్రక్షన్స్ పూర్తయ్యే దశకు వచ్చిన క్రమంలో తమకు బకాయి పడ్డ బిల్లులు ఇవ్వలేదని వాపోయారు. కనీసం కన్స్ట్రక్షన్స్ ఏరియాలోకి కూడా అడుగు పెట్టనివ్వకుండా బౌన్సర్లతో తమపై దాడులు చేస్తున్నారని సాయి తిరుమల కన్స్ట్రక్షన్స్ కంపెనీ యాజమాన్యం,కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి ఇక్కడ పెట్టుబడులు పెట్టామని, నిర్మాణం పూర్తయ్యే దశకు చేరుకున్న సమయంలో తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.నిర్మాణ విషయంలో ఆదిత్య కన్స్ట్రక్షన్స్ పై కోర్టులో కేసులు ఉన్నాయన్న విషయం తమకు చెప్పలేదని, కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టాక తమను ఇబ్బందులకు గురి చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం కూలీలకు డబ్బులు ఇచ్చే పరిస్థితి కూడా లేదని తమకు తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వలస కార్మిక కూలీలు, సాయి తిరుమల కన్స్ట్రక్షన్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో బీజేపీనీ గెలిపించండి

**నియోజకవర్గ ప్రజలకు కర్ణాటక ఎమ్మెల్యే భగీరథి పిలుపు**

**విశాలభారతి,బెల్లంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీనీ అధికారంలోకి తేవడానికి బెల్లంపల్లి నియోజకవర్గంలో బీజేపీనీ భారీ మెజారిటీతో గెలిపించాలని కర్ణాటక రాష్ట్ర సులియ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే భగీరథి మురల్య పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఈ రోజు బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి, భీమిని మండలాల సంయుక్త కార్యవర్గ సమావేశం టేకులపల్లిలో జరిగింది. అనంతరం నెన్నెల్ మండలం మండలంలోని నందులపల్లిలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే భగీరథి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ నీ గెలిపించడానికి బీజేపీ కార్యకర్తలు సైనికులుగా పనిచేయ్యాలనీ అన్నారు. పార్టీనీ బూతు స్థాయిలో నిర్మించి బలోపేతం చెయ్యాలనీ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో BRS పార్టీ అవినీతిలో ముందుకు పోయిందని ఆ పార్టీ నీ గద్దె దించుతేనే ప్రజల సమస్యలు తీరుతాయి అని అన్నారు. దేశంలో అవినీతి రహిత ప్రజసంక్షేమమే ధ్యేయంగ పనిచేస్తున్న నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపర్చాలని అన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ ఇన్చార్జి కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే చిన్నయ్య ఎన్ని అరాచకాలు చేసిన ,భూ కబ్జాలు చేసిన, గుండాయిజం చేసిన, అమ్మాయిలని వేధించిన వారి అధిష్టాన నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ మళ్ళీ అతనికి బెల్లంపల్లి టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించడం సిగ్గు చేటు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి కెసిఆర్ దళితులను మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నారు. రానున్న ఎన్నికల్లో దళితులు కెసిఆర్ కి బుద్ధి చెప్పాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, రజని, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాజూ లాల్ యాదవ్, మండల అధ్యక్షులు రామయ్య యాదవ్, సత్యనారాయణ కొంక, శైలేంద్ర సింగ్, అజ్మీరా శ్రీనివాస్, ప్రశాంత్, భీమన్న, కమల, ఉదయశ్రీ, , గట్టు శివ లింగయ్య, కోట రాజన్న, నర్సింగ్, ఉదయ శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురా వేస్తా

**విశాల భారతి,బెల్లంపల్లి:** బెల్లంపల్లి నియోజకవర్గలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థితత్వం కొరకు బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాతరీ స్వామి తన ఎమ్మెల్యే ధరఖాస్తు ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలతో గాంధీభవన్ లో అందచేసారు. కాంగ్రెస్ పార్టీ గత 30సంవత్సరాలనుండి బెల్లంపల్లి నియోజకవర్గంలో అధికారం లోకి రాలేదని తనకు అవకాశం ఇస్తే బెల్లంపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చేలా అహర్నిశలు పాటుపడుతానని ప్రతి కార్యకర్తలను, కాంగ్రెస్ నాయకులను సమాన్వయం చేస్తూ బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురావేస్తాం అని బెల్లంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు తన మిద ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే పెద్దలు ఏ ఐ సి సి మెంబెర్, మాజీ శాసన మండలి సభ్యులు, డి సి సి జిల్లా అధ్యక్షులు సురేఖ,వారి ఆశీస్సులతో బెల్లంపల్లి పాదయాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు, తదనంతరం నాతరీ స్వామి మాజీ ఉప ముఖ్య



మంత్రి దామోదర రాజనరసింహ కీ సి.డబ్లు.సి లో శాశ్వత మెంబర్షిప్ వచ్చిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గెల్లీజయరాం యాదవ్ , ఎం. డి ఆఫ్జల్ పార్టీ నాయకులు తదితరులు పాలుగోన్నారు



# టికెట్ ఎవరకి వచ్చినా బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలి

**ఎమ్మెల్యే శరణు సలగార్**

**నారాయణఖేడ్,విశాలభారతి:** నారాయణఖేడ్ లో కొనసాగుతున్న బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన నాగిల్ గిద్ద లో మిగులు ఆదాయంతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని తన స్వార్థంతో కేసీఆర్ దివాళా తీయించారన కర్ణాటక బస్వకల్యాణ్ ఎమ్మెల్యే శరణు సలగార్ అన్నారు . కేవలం మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజల్ని ఆయన అవమాన పరుస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం నాడు నాగిలిగిద్ద, మణూరు మండలాల్లో పార్టీ సంస్థాగత పరిస్థిత పై ఆయన సమీక్ష నిర్వహించారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ, రూరల్ మండలం మీటింగ్ లోను ఆయన మాట్లాడారు. దేశంలో పార్టీ జండా పెట్టడానికి అవకాశమే లేదన్న ప్రాంతంలో అధికారంలోకి వచ్చిన ఘనత బీజేపీది అని సలగార్ అన్నారు. పార్టీ టికెట్ ఎవరకి వచ్చినా బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం అందరూ పనిచేయాలని ఆయన సూచించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కవల పిల్లలు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప విమర్శించారు. నారాయణఖేడ్ తో సహా రాష్ట్రమంతటా ఈ రెండు పార్టీల నాయకులు బయట తిట్టుకుంటూ, లోలోపల కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారని ఆయన అన్నారు. అవినీతి తో సంపాదించిన డబ్బును ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేయడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధమవుతున్నాయని, కాని రాష్ట్ర ప్రజలు ఆ రెండు పార్టీలను తిరస్కరిస్తున్నారని సంగప్ప పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన రావాలంటే కేవలం అది బీజేపీ వల్ల మాత్రమే సాధ్యం అని ఆయన వివరించారు. పార్టీలోని అందరు కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు సాధ్యమే అని మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి అన్నారు. నాగిల్ గిద్ద దత్తాత్రేయ ఆలయ ప్రాగంణంలో జరిగిన ఈ సమావేశంలో నగేష్ యాదవ్, రవిగౌడ్, రజినీకాంత్, మారూతి రెడ్డి, సంజు పాటిల్ , రమేష్ యాదవ్, సిద్దయ్య స్వామి, మోహన్ రెడ్డి, నిజానందరెడ్డి, రెండు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు చట్టాలు,నేరాలపై అవగాహన సదస్సు

**విశాల భారతి,ధర్పల్లి:** నిజామాబాద్ పోలీస్ కమిషనర ్ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం వారి ఆధ్వర్యంలో ధర్పల్లి పోలీస్ స్టేషన ్పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మంగళవారం విద్యార్థిని, విద్యార్థులకూ మరియు అధ్యాపకులకు నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించామని ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు.

**ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.....**

మహిళలను, బాలికలను ఎవరైనా వేధించిన, చట్టపరమైన చర్యలు తీసుకోవడనికి షీ టీమ్ బృందాలు ఉంటాయని, ఆపద సమయంలో రక్షణ కోసం 8712659795 లేదా డయల్ 100 కి ఫోన్ చెయ్యాలని తెలిపారు.ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలి.హెల్మెట్ బరువు కాదు మన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలి, సీసీ కెమెరాలు వల్ల గ్రామం సురక్షితంగా ఉంటుంది, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు.ఎవరి మొబైల్ ఫోన్ దొంగిలించిన, పోగొట్టుకున్న (CEIR) సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరి చేయడం జరుగుతుందని,
మూడ నమ్మకాలు నమ్మవద్దు మంత్ర తంత్రాలు




పారద్రోలాలి.ఆన్లైన్ మోసాలు గురించి అప్రమత్తంగా ఉండాలని వివరించారు,దీనికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1930 వినియోగించుకోవాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండి నకిలీ ఏజెంట్లు నమ్మకూడదు వారు నిరుద్యోగులకు మాయమాటలు, లేనిపోని ఆశలు, అత్యశలు చూపించి మోసం చేస్తున్నారు, కావున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.అందరూ శాంతియుతంగా అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలి. సమాజంలో జరుగతున్న నేరాలు, చట్టాలపై విద్యార్థులకు ఉపాధ్యాయ బృందానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దర్పల్లి పోలీస్ స్టేషన ్ఎస్సై వంశీ కృష్ణ రెడ్డి,సిబ్బంది గోవర్ధన్,గోవింద్, పోలీసు కళాబృందం , అధ్యాపకులు మరియు వంద మంది విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.




# చంద్రయన్ 3 విజయవంతం కావాలని విద్యార్థులు ప్రార్థనలు

**విశాలభారతి,ధర్పల్లి:** మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ పాఠశాలలో ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ 3 విజయవంతంగా చంద్రుపై అడుగు పెట్టాలని విద్యార్థులు దేవుడికి ప్రార్థనలు చేయడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ బి.ఎ. శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ 3 విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా నేడు చంద్రుడిపై సాయంత్రం 6.04 నిమిషాలకు అడుగు పెడుతుందని, అడుగుపెట్టిన తర్వాత అంతా సవ్యంగా ఉంటే జాబిలమ్మ పై నీరు, గాలి మానవులు నివసించడానికి అనుకూల వాతావరణం ఎలా ఉందో తెలుపుతుందని ఇలా జరిగితే ప్రపంచంలోనే మొట్టమొదటి దేశంగా భారతదేశంగా కీర్తింపబడుతుందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 4లోగా దోస్త్ ఆన్లైన్ వెబ్సైట్

**ఆమనగల్లు,విశాలభారతి:** ఆమనగల్లు పట్టణంలో 2023 24 సంవత్సరానికి గాను నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూపులలో జాయిన్ అయ్యే విద్యార్థిని విద్యార్థులు సెప్టెంబర్ 4లోగా దోస్త్ ఆన్లైన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే. ప్రభు తెలిపారు. ఈ అవకాశాన్ని డిగ్రీ విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన పేర్కొన్నారు.



# దళిత బంధు లేపిన ధుమారం

- మండల వ్యాప్తంగా "దళిత బంధు" ధుమారం
- ఇప్పటికే గ్రామాల్లో కొందరిని అర్హులుగా గుర్తించిన వైనం
- తమకు ఎందుకు రాలేదని సర్పంచ్ ఎంపీటీసీ లపై మండిపడుతున్న ప్రజలు
- తహసీల్దార్ కార్యాలయంలో కుల ,రాబడి ధృవీకరణ పత్రాల కోసం పడిగాపులు

**అనంతగిరి, విశాల భారతి :** హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మునుగోడులో జరిగిన మద్యంత్ర ఎన్నికల్లో భాగంగా భారాస అభ్యర్థి గెలుపుకై ముఖ్యమంత్రి దళితులకు దళిత బంధు రూపంలో 10 లక్షల అందజేస్తామని హామీ ఇచ్చిన మాట విధితమే. ఈ మేరకు అదే నియోజకవర్గం లో కొందరికి దళిత బంధు అంద చేసిన మాట వాస్తవమే. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా కూడా దళిత బంధు అమల్లోకి రావడంతో దళితవాడలో అభివృద్ధి ఆశలు చెలరేగాయి. ప్రకటించిన నాటి నుండి తిరిగి ఎన్నికలు రాబోతున్న నేటి వరకు పూర్తిస్థాయిలో దళిత బంధు అందలేదని ఆరోపణలు కూడా అధికంగానే ఉన్నాయి. ఇందులో భాగంగా అనంతగిరి మండల వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాల్లో గత కొద్ది రోజుల నుండి దళిత బంధు పంపకాలు జరుగుతున్నట్లు కూడా ఆరోపణలు వెల్లివేత్తగా స్థానిక నాయకులు, సర్పంచులు, ఇండ్ల చుట్టూ ప్రజలు ప్రదక్షిణాలు చేశారు. మరలా కొద్ది రోజుల తర్వాత దళిత బంధు దుమారం లేవడంతో అర్హులను గుర్తించకుండా వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దళిత బందు అర్హులను గుర్తించడం ఏమిటని వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీలో ప్రధానంగా ఉంటూన్న వ్యక్తులకు దళిత బంధు అందజేసినట్లు ఆరోపణలు రావడంతో ఓ గ్రామంలో సర్పంచ్ని నిలదీసిన సంఘటనలు కూడా జరిగాయి. స్థానిక సర్పంచులకు ఎలాంటి ఆదేశాలు లేవని స్థానిక ఎమ్మెల్యే ద్వారా అర్హులుగా కొందరిని గుర్తించినట్లు సర్పంచులు చెప్పుకొచ్చారు. దళిత బంధు పంపకాల మాట దేవుడెరుగు కానీ మండల వ్యాప్తంగా ఇంతవరకు పారదర్శకంగా లబ్ధిదారులు బహిర్గతం కాక పోవడం విశేషం. ఇదిలా ఉండగా దళిత బంధు దరఖాస్తులకై అవసరమైన కుల, రాబడి ధృవీకరణ పత్రాల కోసం గత కొద్దిరోజులుగా తాసిల్దార్ కార్యాలయం వైపు ప్రజలు పరుగులు పెడుతున్నారు. వందల కొద్ది దరఖాస్తులు కార్యాలయంలో పడి ఉన్నాయి .మరికొందరు దళిత బంధులో గ్రామానికి కేటాయించిన వాటిలో అందరికీ ప్రసాదం రూపంలో పంచుతారనే ఆశాభావంతో దళితులు ఎదురుచూడడం మరో విశేషం.స్థానిక నాయకుల చేతిలోనే అర్హుల జాబితాను తయారు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్హుడైన దళితుడు నీరుగారాల్సిందేనా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్న స్థానిక పార్టీ నాయకులు సంబంధిత అధికారులు దళిత బంధు విషయమై మండల వ్యాప్తంగా లేపుతున్న దుమారంపై పెదవి విప్పకపోవడం గమనార్హం ఏదిఏమైనా వెల్లడం విషయంపై స్థానిక దళితవాడలో చర్చలు పుష్కలంగానే ఉన్నాయి. రాబోతున్న ఎన్నికల సమయంలో దళిత బంధు విషయంపై ఉన్న అనుమానాలను ఎలా పోగొడతారో చూడాలి.

# ఉమ్మడి జిల్లా పోటీలో ఉద్యమ నేత..

- అభ్యర్థులకు వెయ్యేనుగుల బలం...
- కామారెడ్డి నుంచి కెసిఆర్ పోటీతో మిగతా అభ్యర్థుల బలోపేతం..
- ఇక తమకు విజయం తథ్యమనే ధీమాలో బీఆరెస్ అభ్యర్థులు..

**నిజామాబాద్, విశాలభారతి:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి నియోజకవర్గం నుంచి రానున్న శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి టిఆర్ఎస్ అధినేత కేసియారే పోటీలో నిలబడటంతో ఉమ్మడి జిల్లా టిఆర్ఎస్ పార్టీకి వెయ్యేనుగుల బలం వచ్చినట్లు అయింది. 10 సంవత్సరాల సుదీర్ఘ వ్యవధిలో పలు కారణాల చేత విముఖ పరిస్థితులు ఎదురవడం సిట్టింగ్ అభ్యర్థులకు సహజమే. అయినా తమ నియోజకవర్గాల్లో కెసిఆర్ అందించిన భారీ అభివృద్ధి, దేశమంతా ఆసక్తిగా పరిశీలిస్తున్న సంక్షేమ పథకాల ఆసరాతో గట్టెక్క గలమని నమ్మకంతో ఉన్న ఉమ్మడి జిల్లాలోని టిఆర్ఎస్ సిట్టింగులం దరూ ఏకంగా అధినేత కెసిఆరే కామారెడ్డి నుంచి బరిలో నిలబడ టం ఇక తమ విజయమే తరువా యి అనే ఆనందంలో మునిగిపో యారు. గురి తప్పని వ్యూహం కేసీఆర్ ది అనేది అందరికీ తెలిసిందే. కామారెడ్డి బరిలో నుంచి దిగడం వెనక కెసిఆర్ పదునైన విజయవ్యూహం ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులందరినీ అలవోకగా గెలుపు తీరాలకు చేర్చే అవకాశాలను కాదనలేమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబా ద్ జిల్లాలోని నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచి రాష్ట్ర కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ కు అత్యంత విశ్వసనీయు డిగా ఉన్న వేముల ప్రశాంత్ రెడ్డి బాల్కొండ నియోజకవర్గానికి అభివృద్ధిని భారీగానే అందించారు. దీంతో బాల్కొండలో వేముల ప్రశాంత్ రెడ్డిని ఎదుర్కోవడం ఆషామాషీ కాదనే క్లియర్ కట్ టాక్ ఉంది.

నిజామాబాద్ రూరల్ నియోజ కవర్గం నుంచి మరోసారి పోటీలో నిలువనున్న టిఎస్ఆర్టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ బలమైన మాస్ లీడర్ గా, తన సామాజిక వర్గం బలగం, బలం ఉన్న ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎక్కడనుండి పోటీ చేసినా గెలిచి రావడం తన ప్రత్యేకతగా పేరున్న బాజిరెడ్డిని ఎదుర్కోవడం రాజకీయాల్లో మహా ఉద్దండులకే సులువు కాలేదని చరిత్ర ఉంది. పైగా రూరల్ నియోజకవర్గం అన్ని విధాల భారీ అభివృద్ధిని అందించారు.ఆర్మూర్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలుపొందిన ఆశన్న గారి జీవన్ రెడ్డి కెసిఆర్ కుటుంబానికి గారాబాల శిష్యుడిగా, నియోజకవ ర్గానికి అభివృద్ధిని అందించిన ఎమ్మెల్యే గానే కాకుండా ప్రత్యర్థులను వె రువకుండా ఎదుర్కొంటా డని పేరుంది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం లో మునుపెన్నడూ లేని అభివృద్ధిని నిజామాబాద్ నగరంలో చేసి చూపించాడని పేరు ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు ఉంది. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతో ఇటీవల ఐటీ హబ్ తో పాటు నగరంలో డ్రైనేజీలు రోడ్లు తదితర సదుపాయాలను గణనీయంగా అభివృద్ధి పరచడంతో పాటు నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దు తున్నారు. సౌమ్యుడిగా పేరు ఉంది.బోధన్ నియోజక వర్గంలో రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచి మూడోసారి బరిలోకి దిగనున్న షకీల్ కు మైనారిటీ ఓటు బ్యాంకు సొంత బలగం లాంటిది. బోధనను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతో అభివృద్ధి పథంలో నిలబెట్టారు. ఇటీవలే బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కవిత ఎమ్మెల్యే షకీల్ నిర్వహించిన పాదయాత్ర ఏకంగా విజయ యాత్ర అనే తలపించి షకీల్ మరో విజయానికి దోహదం చేసింది.

కామారెడ్డి జిల్లాలో బాన్సువాడ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి శాసనసభాపతిగా ఉన్నత స్థానంలో ఉన్నారు. ఎమ్మెల్యేగా వరుసగా గెలుపొందిన, మంత్రి పదవుల్లో రాణించిన పోచారం బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన ఘనంగా నిలిపారు. రాజకీయ సుదీర్ఘ అనుభవశాలిగా, లక్ష్మి పుత్రుడిగా కెసిఆర్, నియోజకవర్గ ప్రజలు పిలుచుకునే పోచారం శ్రీనివాస్ రెడ్డి గెలుపు నల్లేరుపై నడకే అని అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు రాజకీయ పరిశీలకులు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జాజాల సురేందర్ ఎమ్మెల్యేగా గెలిచి ఎల్లారెడ్డి అభివృద్ధి వెనుకబాటు ను సీఎం కేసీఆర్ మంత్రులు కేటీఆర్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత సహకారం తో తొలగిస్తూ వస్తున్నారు.

అభివృద్ధిని చూపించిన ఎమ్మెల్యేగా మరోసారి సురేందర్‌కు విజయ అవకాశాలు ఉంటాయనేది రాజకీయ వర్గాల విశ్లేషణ. జుక్కల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న హనుమంతు షిండేకు ప్రజల్లో చక్కని అభిమానం కనిపిస్తూ ఉంటుంది. అభివృద్ధిలో వెనుక బాటు కు చిరునామాగా ఉండే జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా చేర్చిన ఘనత హనుమంత్ షిండేది. జిల్లాలో ఏ ప్రాంతం నుంచైనా జుక్కలకు వెళ్లాలన్న.. జుక్కల్ నుంచి జిల్లాలోని ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా ముందుగా జుక్కల్ నియోజకవర్గం లోని నరకప్రాయమైన రోడ్లను తలుచుకొని భయపడే వారమని ఆ జిల్లా.. జుక్కల్ ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులు చెబుతుండేవారు. జుక్కల్ నియోజకవర్గం లో హనుమంతు షిండే చాలా చక్కగా ఇంజనీరు దృష్టితో రోడ్లు వేయించాడని ఉద్యోగులు ప్రత్యేకంగా చెప్పుకుంటూ ఉంటారు. అట్టడుగు నుంచి దళిత సామాజిక వర్గం నుంచి వచ్చిన హనుమంతు షిండే తన మూలాలు మర్చిపోకుండా పేదలకు అందుబాటులో ఉంటాడని పేరు ఉంది. ఇలా ఉమ్మడి జిల్లాలో పాజిటివ్ ట్రెండ్ ఉన్న సిట్టింగుల్లో ఇటీవల కాంగ్రెస్ కొంత పుంజుకోవడం ఒకింత టెన్షన్ కలిగిస్తున్నదని చెప్పుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో స్వయంగా కేసీఆరే కామారెడ్డి నుంచి పోటీలో నిర్వహించడం సెట్టింగుల్లో భరోసా నింపింది.






## ఏ ఎన్ఎంల దీక్షకు మద్దతు తెలిపిన పంజాల, పోత్నక్

**యాదాద్రి భువనగిరి, విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గత 18 రోజులుగా దీక్ష చేస్తున్న రెండవ ఏ ఎన్ ఎం లకు ఈరోజు భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ సంఘీభావం తెలపడం జరిగింది. ముందుగా ఏఎన్ఎంల జిల్లా అసోసియేషన్ బాధ్యులు ఇరువురు నాయకులకు వినతి పత్రాలు సమర్పించి వారి సమస్యలను తెలియజేసిన అనంతరం పంజాల రామాంజనేయులు గౌడ్, పోత్నక్ ప్రమోద్ కుమార్ గార్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు అనేవారే ఉండరని ఇంటికో ఉద్యోగం ఇస్తానని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నవారికి జీతాలు ఇవ్వక రెగ్యులరైజ్ చేయక వేధిస్తున్నాడని రెండవ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయకుండా పుండు మీద కారం చల్లినట్టు వీరిని నియమించాల్సిన స్థానంలో ఉద్యోగ నోటిఫికేషన్ వేయడం నియంత పాలనకు నిదర్శనం అని అన్నారు.రాబోవు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఆయంలో కచ్చితంగా రెండవ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ పక్షాన రెండవ పోరాటానికి పూర్తి మద్దతు ఇచ్చి మీ పక్షాన పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఈరపాక నరసింహ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ , మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, బండారు ఆగమయ్య గౌడ్,యువజన నాయకులు ముచ్చాల మనోజ్, జువ్వగాని శ్రీధర్, సాల్వేర్ ఉపేందర్, ఎండీ శానూర్. పట్టణ ఉపాధ్యక్షుడు జిట్ట మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అవకాశం ఇవ్వండి... కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

**కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని సుంకిరెడ్డి దరఖాస్తు**

**అమనగల్లు,విశాలభారతి:** కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇస్తే కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చెప్పారు. వెల్దండ మండలం చౌదర్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రాబోయే 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని గాంధీ భవన్ లో దరఖాస్తు చేసుకున్నారు.2018 నుండి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతుగా ప్రయత్నం చేస్తున్నానని, అదేవిధంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ మెంబర్ గా అమెరికాలో డల్లాస్ మహానగరంలో తెలంగాణ వాసులతో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమాలు చేయడం జరిగిందని,గత మూడు నెలల నుండి కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ,పార్టీ బలోపేతమే ధ్యేయంగా పార్టీ యొక్క సంక్షేమ పథకాలు, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ ఇలా అనేక కార్యక్రమాలు గడప గడపకు తీసుకువెళ్లడానికి, ప్రజలకు వివరించడానికి గ్రామ గ్రామాన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టి ,గ్రామాల్లో జెండావిష్కరణ లు చేయిస్తూ,కార్యకర్తలకు అండగా ఉంటూ, వారిని పరామర్శిస్తూ ఆపద సమయాల్లో ,నిస్సహాయ స్థితిలో, అత్యవసర పరిస్థితులలో అనేక వేలమంది కార్యకర్తలకు, వారి కుటుంబాలకు ఆర్థికంగా సహకరిస్తూ వారికి అండగా ఉంటూ, భరోసానిస్తూ పార్టీ బలోపేతం కోసం మరింతగా కష్టపడడానికి అందరిని ప్రోత్సహిస్తూ వారికి వెన్నుదన్నుగా ఉంటూ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తున్నానని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## గిరిజన మహిళపై పోలీసుల దాడి దుర్మార్గపు చర్య

- ఘనటకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సీసీఆర్ జోనల్ కార్యదర్శి అశోక్ కుమార్ కాకర్ల
- ఘటనపై గవర్నర్, హెచ్ఆర్సీ,డీజీపీలకు వినతిపత్రం అందజేసిన సీసీఆర్ సభ్యులు

**మేడిపల్లి,విశాలభారతి:**గిరిజన మహిళ వద్యా లక్ష్మిపై దాడికి కారకులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి,వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీసీఆర్ జోనల్ కార్యదర్శి అశోక్ కుమార్ కాకర్ల అన్నారు.ఆగస్టు 15వ తేదీన ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో మహిళపై జరిగిన దాడి ఘటనపై స్పందిస్తూ మంగళవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసిఆర్) జోనల్ కార్యదర్శి అశోక్ కుమార్ కాకర్ల,లీగల్ అడ్వైజర్ మణికంఠ గౌడ్ ల ఆధ్వర్యంలో మానవ హక్కుల కమిషన్ (ఎచ్ఆర్సీ), తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ,రాష్ట్ర డిజిపిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసును సుమోటోగా తీసుకుని బాధితురాలికి సత్వర న్యాయం చేసేలా, దోషులను కఠినంగా శిక్షించి,సర్వీస్ నుండి పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలి కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు,ఆమె కూతురికి ప్రభుత్వ ఉద్యోగం

ఇచ్చి న్యాయం జరిగేలా చూడాలన్నారు.వారికి న్యాయం జరిగే వరకు మా సంస్థ అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఐలయ్య,జి తేజేశ్వర్,మరాటి మల్లేష్, శివప్రసాద్, రచ్చ కిషన్, హాజీ బాబా, ఖలీల్, ఆంజనేయులు, కొత్త మల్లేశ్వరరావు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ డిఎంహెచ్ఓ హర్షవర్ధన్



**మోతె,విశాల భారతి :** మోతె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగళ వారం ఆకస్మికంగా డి యం హెచ్ ఓ హర్ష వర్ధన్ తనిఖీ చేశారు ఓపి సేవలు సిబ్బంది గైర్హాజరు వైద్య సేవలు గురించి ఆరా తీశారు రికార్డులను పరిశీలించి వర్షాకాలంలో వచ్చే వ్యాధుల ప్రతి ఒక్కరు ప్రతి సెంటర్లలో సిబ్బంది సకాలం లో అందుబాటులో ఉండాలని వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డెలివరీ ల సంఖ్య పెంచాలని సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని కోరారు వర్షాకాలంలో డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా వంటి వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సిహెచ్ఓ యాదగిరి ,కొండ శీను డాక్టర్ నాగరాజు ,సూపర్వైజర్స్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



## అవకాశం ఇవ్వండి బెల్లంపల్లి లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురా వేస్తా

**విశాలభారతి,బెల్లంపల్లి:**బెల్లంపల్లి నియోజకవర్గలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థితత్వం కొరకు బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాతరీ స్వామి తన ఎమ్మెల్యే ధరఖాస్తు ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలతో గాంధీభవన్ లో అందచేసారు.

కాంగ్రెస్ పార్టీ గత 30సంవత్సరాలనుండి బెల్లంపల్లి నియోజకవర్గంలో అధికారం లోకి రాలేదని తనకు అవకాశం ఇస్తే బెల్లంపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చేలా అహర్నిశలు పాటుపడుతానని ప్రతి కార్యకర్తలను, కాంగ్రెస్ నాయకులను సమాన్వయం చేస్తూ బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురావేస్తాం అని బెల్లంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు తన మిద ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే పెద్దలు ఏ ఐ సి సి మెంబెర్, మాజీ శాసన మండలి సభ్యులు, డి సి సి జిల్లా అధ్యక్షులు సురేఖ,వారి ఆశీస్సులతో బెల్లంపల్లి పాదయాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు, తదనంతరం నాతరీ స్వామి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ కీ సి.డబ్లు.సి లో శాశ్వత మెంబర్షిప్ వచ్చిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గెల్లీజయరాం యాదవ్ , ఎం. డి ఆఫ్జల్ పార్టీ నాయకులు తదితరులు పాలుగోన్నారు




## మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు**

**బాల్కొండ,విశాలభారతి:** మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయం దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాన్ని వెంటనే ఇవ్వాలని,నాలుగు సంవత్సరాల నుండి బకాయి ఉన్న ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులను వెంటనే జమ చేయాలని, వారానికి ఒక రోజు సెలవును మంజూరు చేయాలని తెలిపారు.వెంటనే మున్సిపల్ పాలకవర్గం,అధికారులు కార్మికుల బకాయిలను చెల్లించి పిఎఫ్, ఈఎస్ఐ జమ చేయాలని అన్నారు.తమ సమస్యల పరిష్కారం కొరకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోవర్ధన్, నాగేశ్వర్,కార్మిక సంఘం నాయకులు విశ్వనాథ్, విజయ్,బాలమ్మ,లక్ష్మి,సాయవ,రాజన్న,కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## సాంక్రమిత వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి

**జడ్పిటిసి పుల్లారావు**



**మోతె, విశాల భారతి :** మంగళవారం మండల కేంద్రంలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నెలలో మూడవ శనివారం నిర్వహించిన జన ఆరోగ్య సమితి కార్యక్రమంలో పాల్గొన్న జడ్ పి టి సి పందిళ్ళ పల్లి పుల్లారావు వైద్యాధికారి సిబ్బందితో మాట్లాడుతు పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు సంక్రమిత వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారని దోమల నివారణకు తీసుకునే జాగ్రత్తలు గురించి అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు గొళ్ళా లు పాత కూలర్ లు సెప్టిక్ ట్యాంక్ లలో దోమలో బాగా వృద్ధి చెందె అవకాశం ఉన్నందున వాటిని లార్వా దశలో వాటిని వృద్ధి చెంద కుండా నివారించాలని ఈగలు వాలిన ఆహార పదార్థాలను నీటిని తాగిన అతిసార వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుందని మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ లాంటివి నిర్ధారించడానికి ర్యాపిడ్ కిట్ల తో టెస్ట్ లు చేసి చికిత్స అందించాలని కోరారు గర్భిణి స్త్రీలకు పోషకాహర లోపం లేకుండా రక్త హీనత రాకుండా కాపాడాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బంది దే అని అన్నారు పసి పిల్లలకు బాలింతలకు పౌష్టికాహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రకాష్ రావు , యం పి డి ఓ వెంకటా చారి, వైద్యాధికారి వై నాగరాజు , హెల్త్ సూపర్ వైజర్ కమలమ్మ ,స్టాప్ నర్స్ నాగమణి , పార్మసీస్ట్ రాణి ఆయుస్సు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ మైనారిటీ బందు అమలు చేయాలి



**అమనగల్లు,విశాలభారతి:** ఆమనగల్లు మండలం మున్సిపాలిటీలోని అర్హులందరికీ మైనారిటీ బంధు అమలు చేయాలని ఆమనగల్లు ముస్లిం మైనారిటీ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ కు వినతి పత్రం అందజేశారు. మైనారిటీ బందు లబ్ధిదారుల సంఖ్య పెంచాలని, ఆమనగల్లు మండలం,మున్సిపాలిటీలో అధిక శాతము మైనారిటీలు నిరుపేదలే ఉన్నారని, అర్హులందరికీ మైనారిటీ బందు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇవ్వాలని, అదేవిదంగా మరల దరఖాస్తు గడువు పొడిగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు ఖలీల్, ఖాదర్, రహీమ్, బాబా, మొయిన్,గౌస్,మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్,మున్సిపల్ చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ విజయ్ కృష్ణ, కోఅప్షన్ సభ్యులు మెడిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ ప్రభుత్వంలో కులవృత్తులకు మహర్దశ

**విశాల భారతి /ములుగు:** ములుగు మండల ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్ యాదవ్ బిసి బంధు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 14కులాలకు చెందిన 59మంది లబ్ధిదారులకు ఒక్కకరికి లక్ష రూపాయలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు కులవృత్తులను ప్రోత్సహించకపోవడం వల్లన కులవృత్తులు కనుమరుగయ్యాయి, ఉపాధి లేక కుల వృత్తులు వారు ఎన్నో యిబ్బందులు పడ్డారు అని తెలియజేశా రు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ హయ్యంలో కులవృత్తుల మీద ఆధారపడి జీవించే కులాల వారికి ప్రోత్సాహకంగా లక్ష రూపాయలు బ్యాంకు లింకేజీ లేకుండా రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. గౌడ కులస్తుల కోసం ఈత తాటి వనాలు నాటి, చెట్టు పన్ను మాఫీ,చెట్టు పై నుండి ప్రమాద వశాత్తు గాయపడ్డ గీత కార్మికులకు ఎక్స్గ్రేషియా పెంచడం జరిగింది.

చేనేత కార్మికులకు ఆదుకోవడానికి పెన్షన్ ఇవ్వడం, 50 శాతం సబ్సిడీపై నూలు అందజేయడం, బతుకమ్మ పండుగ చీర పంపిణీ కార్యక్రమం భాగంగా చేనేత కార్మికులకు చీరల నేయడం వల్ల ఉపాధి కల్పించి, ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు.యాదవులకు గొర్ల పంపిణీ, గంగపుత్రులకు,ముదిరాజ్ లకు చేపల పంపిణీ చేపట్టి కులవృత్తుల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని, తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా జరగడం లేదని అన్నారు.ముఖ్యమంత్రి నిరాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వధించి మళ్ళీ విజయం అందించాలని కోరుకుంటూ హైట్రిక్ విజయం సాధిస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమం లో ఎంపిటీసీ జన్నారపు శ్రీను బిసి వెల్ఫర్ అధికారి లక్షన్ ములుగు ఎంపీడీఓ ఇక్బాల్ సూపరిడెంట్ భాస్కర్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వల్మీడి సీతా రామచంద్ర స్వాముల విగ్రహాల పునః ప్రతిష్టాపన

**సెప్టెంబర్ 4న వల్మీడికి సీఎం, చిన్న జీయర్ స్వామి**

**విశాల భారతి,పాలకుర్తి :** ఆది కావ్యం రామాయణ సృష్టి కర్త వాల్మీకి మహర్షి పుట్టిన ఊరుగా ప్రతీతి చెందిన వాల్మీకి పురం కాలక్రమంలో జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మీడి గ్రామంలో ఆయన నివసించిన మునుల గుట్ట పక్కనే గల రాముడు నడయాడిన గుట్ట మీద శ్రీ సీతారామచంద్ర స్వామి వారి విగ్రహాల పున: ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా, అంగరంగ వైభవంగా జరుగనుంది. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా వల్మీడి శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి విగ్రహాల పున: ప్రతిష్టాపన జరగనుండగా, అత్యద్భుతంగా తీర్చిదిద్దిన, కొత్తగా నిర్మించిన దేవాలయాన్ని సీఎం కెసిఆర్ ప్రారంభించనున్నారు. అదే రోజు మంత్రులు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజా ప్రతినిధులు రానున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4 వ తేదీ వరకు 4 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలపై ప్రత్యేకంగా రూపొందించిన 6 ప్రచార రథాలతో ఆడియో, వీడియోలతో విస్తృతంగా ప్రచారం చేస్తూ అందరికీ ఆహ్వానం పలకనున్నారు. దేవాలయ ప్రాంగణంలో ఓ బ్యాగు పసుపు, కుంకుమ, గాజులు, పులిహోర లడ్డు ప్రసాదాల పంపిణీ చేయనున్నారు. సకుటుంబ సపరివార సమేతంగా తరలి రావాలని ప్రజలకు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వల్మీడి దేవాలయ ప్రాంగణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు 30 వేల మందికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మీరు షామ్యానాలు టెంట్లు కుర్చీలు ఇతర వసతులతో కూడిన ఏర్పాట్లను చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**ఏర్పాట్లపై కమిటీలు**

వల్విడి శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్టాపన సందర్భంగా చేయనున్న ఏర్పాట్లకు సంబంధించిన వివిధ కమిటీల రూపకల్పన వాటి పని తీరును మంత్రి అధికారులకు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో మాట రాకుండా భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ప్రతి మండలానికి ప్రచార రథం

దేవాలయ పున ప్రారంభం సందర్భంగా తరలి



వచ్చే భక్తుల కోసం పాలకుర్తి నియోజకవర్గం లోని 6 మండలాలకు ఆరు ప్రచారను ప్రత్యేకంగా రూపొందించారు. అందులో ఆడియో వీడియో సదుపాయాలు కల్పించారు. మండలానికి ఒకటి చొప్పున పాలకుర్తి దేవరుప్పుల కొడకండ్ల పెద్ద వంగర తొర్రూరు రాయపర్తి మండలాలలో ఆయా వాహనాలు విస్తృతంగా తిప్పుతూ ప్రజలకు ఈ కార్యక్రమానికి సంబంధించి న వివరాలను, అహ్వానాలను అందచేయాలని మంత్రి సూచించారు.

**మండలాల వారీగా సమన్వయ కమిటీలు**

ఈ కార్యక్రమం విజయవంతం కోసం ప్రతి మండలానికి ఒక ప్రత్యేక కమిటీని వేసి ఆ కమిటీ ద్వారా ఆయా కార్యక్రమాల సమన్వయం చేయాలని అధికారులకు సూచించారు.

**ఆ నాలుగు రోజులపాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి 4వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల కోసం ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా నడిపించాలని మంత్రి ఆర్టీసీ అధికారులకు చెప్పారు. పాలకుర్తి చుట్టుముంటున్న తొర్రూరు హనుమకొండ వరంగల్ జనగామ డిపోల నుండి బస్సులు ప్రత్యేకంగా వేయాలని మంత్రి ఎర్రబెల్లి ఆదేశించారు. బస్సులు నడిచే సమయాలను ముందే ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు.

**సకుటుంబ సపరివార సమేతంగా తరలి రావాలి**

పాలకుర్తి నియోజకవర్గం వరంగల్ ఉమ్మడి జిల్లా ఇతర ప్రాంతాల వారు అందరూ సకుటుంబ సపరివార సమేతంగా ఈ ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి దయాకర్ రావు పిలుపునిచ్చారు.

**పార్కింగ్ పై ప్రత్యేక దృష్టి**

ఆర్టీసీ పోలీసు ఇతర అధికారులు గుట్ట సమీపంలో కింది భాగంలో పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ముందుగానే తగు స్థలాన్ని పరిశీలించి అందుకు తగిన విధంగా ఏర్పాటు చేసి వాహన సంబంధమైన సమస్యలేవీ రాకుండా రద్దీకి ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి ఎర్రబెల్లి ఆదేశించారు.

**ఇంటింటికీ పసుపు కుంకుమ ప్రసాదాల పంపిణీ**

పాలకుర్తి నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి స్వామి వారి పసుపు కుంకుమలు తీర్థప్రసాధారణ అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అధికారులను మంత్రి ఎర్రబెల్లి ఆదేశించారు. అవసరమైతే ఎందుకు దాతలను కూడా ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే దేవాలయ ప్రాంగణంలో ఓ బ్యాగు, గాజులు, పులిహోర, లడ్డు, తీర్థ, ప్రసాదాల పంపిణీ కి ఏర్పాట్లు చేయాలని మంత్రి వివరించారు. ఆ నాలుగు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు దేవాలయ ప్రాంగణంలో జరిగే నాలుగు రోజుల ఉత్సవాలలో ప్రతిరోజు సాయంత్రం ఒక రెండు, మూడు గంటల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఎర్రబెల్లి చెప్పారు. సినీ నేపధ్య గాయని గాయకులు సంప్రదాయ నృత్య కళాకారులు పేరని కళాకారులు శివతాండవం భారత నాట్యం జానపద నృత్యాలు గేయాలు కోలాటాలు వంటి పలు తెలంగాణ కళా ప్రక్రియలో అవినీ దేశం ఉన్న వారిని ప్రత్యేకంగా పిలిపించి సాంస్కృతిక విభావరి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, డిసిపి సీతారాం ఎసిపి సురేష్ కుమార్ ఆర్టీసీ విద్యుత్, మంచినీటి సరఫరా పోలీసు పంచాయతీరాజ్, దేవాదాయ డి ఆర్ డి ఓ వంటి వివిధ శాఖల అధికారులు మహిళలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వాళ్లందరికీ మంత్రి స్వయంగా వడ్డించి వారితో కలిసి భోజనాలు చేశారు. అనంతరం మంత్రి పాలకుర్తిలో ని తన క్యాంపు కార్యాలయంలో జనగాం జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ఇతర అధికారులు అందరితో కలిసి మరో సమీక్ష సమావేశాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి వారికి దిశా నిర్దేశం చేశారు.



## ఎఫ్ పీవో లను బలోపేతం చేయాలి

**తెలంగాణ నాబార్డ్ సీజీఎం చింతల సుశీల**

**పాలేరు, విశాల భారతి :** రైతుల అభివృద్ధి కోసమే రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల అన్నారు. స్థానిక సాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో 2019 సంవత్సరంలో కాకరవాయి రైతు ఉత్పత్తిదారుల సంఘం కంపెని నీ సుశీల సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను గ్రామీణ ప్రాంతంలో ఉండే రైతులకు వ్యవసాయ అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు ఉత్పత్తి కంపెనీల ద్వారా నాణ్యమైన విత్తనాలను, పురుగుమందులు, ఫెర్టిలైజర్స్ అందించడం జరుగుతుందని వారు తెలిపారు. మరియు నాబకిసాన్ నేషనల్ బ్యాంక్ మరియు రూరల్ బ్యాంక్ ద్వారా క్రెడిట్ లింకెజీ సదుపాయం కల్పించి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వారు పండించిన పంటలకు వారే నేరుగా మార్కెట్ చేసుకునే విధంగా సదుపాయం కల్పించాలని ఉందన్నారు. రైతుల పండించిన పంటలను ఈ రాష్ట్రంలో కాకుండా దేశంలోని అన్ని సుదూర ప్రాంతాలు, విదేశాలకు ఎగుమతులు చేసేందుకు నేషనల్ మార్కెట్ ప్లాట్ ఫామ్ లో అవకాశం కలుగుతుందన్నారు. కాకరవాయి ఎఫ్.పి.సి.ఎల్ 2020నుండి 23 సంవత్సరం వరకు రైతులకు అందినటువంటి ఇన్పుట్ సర్వీస్ పరిశీలించి కాకరవాయి ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్స్ ను మరియు పాపి సంస్థ సభ్యులను అభినందించారు. అనంతరం సాయి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జీవనోపాది లపై శిక్షణ పొందిన మహిళలకు సుమారుగా 35మందికి టి.పాలెం డిసిసిబి బ్యాంక్ ద్వారా లోన్ కాన్సెంట్ లెటర్స్ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో తయారైన పాలను పెద్ద కంపెనీలు కొనుగోలు చేసి ఎడిషన్ చేసి ఎక్కువ రేటుకు తిరిగి అదే రైతులకు అమ్మడం జరుగుతుంది. అని తద్వారా పెద్ద కంపెనీ లాభాలు ఆశిస్తున్నాయని, రానున్న రోజుల్లో పాల సేకరణ మహిళలు నేరుగా చేసి నెయ్యి, వెన్న, పెరుగు మొదల ఉత్పత్తులను తయారుచేసి అధిక లాభాలను పొందాలని మహిళలకు సూచించారు. భవిష్యత్తులో మహిళలు కూడా ఒక ఎఫ్.పి.సి కంపెనీ లాగా ఏర్పాటై ఐక్యతతో అభివృద్ధి చెందాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆర్గానిక్ ఉత్పత్తులను వాడాలని సూచించారు. రైతులు తమ పంట పొలాల్లో అధికంగా యూరియా క్రిమిసంహారక రసాయన మందులు తగ్గించుకోవాలని భూసారాన్ని కాపాడుకోవడానికి ఆర్గానిక్ ఉత్పత్తులను వాడుకోవాలని తెలిపారు.

అనంతరం ఖమ్మం డిసిసిబి సీఈవో అట్లూరి. వీరబాబు, నాబార్డ్ ఏజీఎం సుజిత్, శ్వేతా సింగ్, మండల ఏవో సీతారాం రెడ్డి, సాయి స్వచ్ఛంద సంస్థ ఇ.వెంకన్న, కాకరవాయి ఎఫ్.పి.సి.ఎల్ చైర్మన్ మోరపాక నాగయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ స్రవంతి, ఏ ఈ ఓ ప్రదీప్, కాకరవాయి మిల్క్ ప్రొడ్యూసర్ సొసైటీ చైర్మన్ కట్కూరి జ్యోత్స్న, మోరపాక మాధవి, ముజాహిద్ పురం సర్పంచ్ యాకమ్మ, ధనలక్ష్మి, ఎన్ మల్లేశ్వరి, నాగమ్మ, జి అనిత కాకరవాయి గ్రామ సర్పంచ్ మౌనిక శ్రీనివాస్, కాకరవాయి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో కట్కూరి శ్రీనివాసరెడ్డి డైరెక్టర్స్ కొప్పెర రాంబాబు, గుండాల లింగయ్య , పల్లా వెంకటరెడ్డి, సురిగి రాములు, గుండాల ఎల్లయ్య, జీ శ్రీశైలం, కే సురేష్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**సూర్యాపేట (విశాల భారతి):** రానున్న శాసన సభ ఎన్నికల్లో బీ ఆర్ యస్ అభ్యర్థులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటారని సోమవారం బి ఆర్ యస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన నేపద్యంలో మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా శాసన సభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,గాధరి కిశోర్ కుమార్,బొల్లం మల్లయ్య,యాదవ్,శానం పూడి సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎన్.భాస్కర్ రావు,ఫైళ్ల శేఖర్ రెడ్డి,నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,రవీంద్ర నాయక్,యం ఎల్ సి కోటిరెడ్డి,డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సోమా భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.



## ఉమ్మడి నల్గొండ జిల్లా ను క్లీన్ స్వీప్ చేస్తాం

- **ఉమ్మడి జిల్లా లో 12 అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది**
- **తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 70 సీట్లు గెలిచి అధికారం చేపట్టబోతుంది**
- **నల్గొండ పార్లమెంట్ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట (విశాల భారతి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 70 సీట్లు గెలిచి అధికారం చేపట్టబోతుందని నల్గొండ పార్లమెంట్ సభ్యులు, మాజీ పీసీసీ అధ్యక్షులు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దోపిడీకి అలవాటు పడి సాధారణ ప్రజలను హింసిస్తున్నారని అన్నారు.కోదాడ, హుజూర్నగర్ ఎమ్మెల్యేల దోపిడీ వికృత చేష్టలకు ప్రజలు విసిగిపోయారని వాళ్లని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు నేను నా సతీమణి, కోదాడ, హుజుర్ నగర్ లలో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 సీట్లకు 12 క్లీన్ సిప్ చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు 70 స్థానాల్లో గెలిచి అధికారం చేపట్టబోతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు ఇచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కి మూడెకరాల భూమి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని ఇంతవరకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల లిస్టు దోపిడీదారులకు, కేసిఆర్ వత్తాసుదారులకు మాత్రమే సీట్లు ప్రకటించారని, అది కాంగ్రెస్ పార్టీకి అధికారం లోకి రావడానికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం నడుస్తుందని అది ఒక్కసారిగా ఆకాశానికి ఉవ్వెత్తిన ఎగిసిపడి, ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గ్లోబల్ ప్రచారం మీద అధికారం లోకి వచ్చిందని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలుసుకోవాలన్నారు. కోదాడ, ముదిగొండ గ్రామంలో దళిత బందులో జరిగిన అక్రమాల పై ఆధారాలతో నిరూపిస్తే ఏ ఒక్కరి పైన కూడా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి, చకిలం రాజేశ్వరరావు, కక్కిరేని శ్రీనివాస్, వేములకొండ పద్మ, చింతమళ్ళరమేష్, ఆలేటి మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.



## ఓటు విలువ చాలా విలువైనది జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్

**తొర్రూర్, విశాల భారతి:** ప్రజాస్వామ్యాన్ని,పరిరక్షించడంలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని మహబూబాబాద్ జిల్లా జడ్పిఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని తొర్రూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తొర్రూర్ ఉప తహశీల్దార్ టి శ్రీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ఎక్కువసార్లు వినియోగించుకున్న వయోవృద్ధులను మరియు నూతన ఓటర్లను శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మనదేశంలో సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయని అందుకు భారత రాజ్యాంగం మనకు ఇచ్చినటువంటి అత్యంత గొప్పనైన హక్కు ఓటు హక్కు ఇట్టి ఓటు హక్కును ఎక్కువసార్లు ఉపయోగించి ఓటును క్రమ పద్ధతిలో క్రమం తప్పకుండా ఎక్కువసార్లు వినియోగించుకున్న ఓటర్ నీ సీనియర్ సిటిజన్ గా పిలవడం జరుగుతుందని ఇలాంటి సీనియర్ సిటిజన్స్ ను మనం ఈరోజు సన్మానించుకోవడం చాలా ఆనందంగా ఉందని అలాగే రాబోయే ఎన్నికల్లో నూతనంగా ఓటు వేసే యువకులను సన్మానించుకోవడం కూడా సంతోషకరమని ఆయన తెలిపారు. భారతదేశంలో రాజ్యాంగం పట్ల నమ్మకం ఉండి రాజ్యాంగం పట్ల విలువలతో కూడిన గౌరవం ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి ఎండి గౌస్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి గౌస్, దుబ్బంతండా సర్పంచ్ విజయ్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షులు ఇట్టే సోమారెడ్డి, మండల రెవెన్యూ సిబ్బంది, బూతు లెవెల్ అధికారులు,సీనియర్ సిటిజెన్లు, ఎలక్షన్స్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లారెడ్డి, మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నోడల్ అధికారులు ఎన్నికల విధులను పటిష్టంగా నిర్వహించాలి

**కలెక్టర్ శశాంక**

**మహబూబాబాద్, విశాల భారతి :** ఎన్నికల విధులు కేటాయించిన నోడల్ అధికారులు పూర్తి అవగాహనతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి.లోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు. నిర్వహించేందుకు 19 విభాగాలకు అధికారులను నియమిస్తూ సమన్వయంతో విధుల నిర్వహణలో చేపట్టాల్సిన బాధ్యతాయుత పనులను తెలియజేసారు.

ఎం.సి.సి. అధికారిగా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్ ను, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ అధికారిగా జడ్పి సి.ఈ.ఓ. రమాదేవితో పాటు జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి హైమావతి లకు విధులు కేటాయించారు. అలాగే ఈ.టీ.పి. బి.ఎస్ అధికారిగా గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్ కు, మెటీరియల్ అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి నర్మద, 5.ఎన్నికల నిర్వహణకు శిక్షణ అధికారిగా జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సూర్య నారాయణ, హెచ్.ఆర్. అధికారిగా ముఖ్య ప్రణాళిక అధికారి పి. సుబ్బారావు ను, సంక్షేమ అధికారిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రు నాయక్, వోటింగ్, పోలింగ్ సిబ్బంది ఏర్పాటుకు జడ్పి సి.ఈ.ఓ.రమాదేవి, ఫిషరీస్ అధికారిణి నాగమణి, ఈ.వి.ఎమ్., వి.వి.పాట్ లకు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, రవాణాకు జిల్లా రవాణా అధికారి రమేష్ రాథోడ్, స్వీప్ అధికారిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, లాఅండ్ ఆర్డర్ అధికారిగా అదనపు



ఎస్పీ చెన్నయ్య, బ్యాలట్ పేపర్ అధికారిగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నరసింహ మూర్తి, మీడియా కోఆర్డినేషన్ అధికారిగా డి.పి.ఆర్.ఓ. శ్రీనివాసరావు, ఐటి అధికారిగా ఈ.డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, అబ్జర్వర్ లకు కో ఆర్డినేషన్ అధికారిగా ఈడీ ఎస్సి కార్పొరేషన్ అధికారి బాలరాజు, ఫిర్యాదులు పై స్పందించుటకు సి.పి.ఓ. కార్యాలయ అధికారిని విజయలక్ష్మి, ఏ.టీ.ఎం అధికారులు గా మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు, తొర్రుర్ ఆర్డీఓ నరసింహారావు, కమ్యూనికేషన్స్ అధికారిగా జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు నర్సింహ మూర్తి లను నియామకం చేశారు. నియమించిన అధికారులు ఎన్నికల విధులను పారదర్శకంగా, జవాబుదారితనంతో అంకితభావంతో పనిచేయాలన్నారు. ములుగు నియోజకవర్గంలోని గంగారాం, ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం మండలాలలో సిగ్నల్స్ పై ఆయా ప్రాంతాలలో దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పి సి.ఈ.ఓ. విధులు కేటాయించిన సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం

**యాదాద్రి భువనగిరి (విశాల భారతి ):** భువనగిరి పట్టణ సుమంగళి ఫంక్షన్ హాల్ లో జరిగినది ఇట్టి పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో సెప్టెంబర్ 3న జరుప తలపెట్టిన పద్మశాలి శంఖారావం సరూర్నగర్ మహాసభకు మన జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో అట్టి సమావేశానికి హాజరు కావాలని అట్టి సభను విజయవంతం చేయాలని ఈనాటి సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినది ఇట్టి సమావేశానికి మన జిల్లా నుండి 150 బస్సులు తీసుకోవాలని అట్టి బస్సుల లో మహిళలు పురుషులు అందరూ తరలి వెళ్లాలని నిశ్చయించడం జరిగినది ఇట్టి సమావేశంలో జిల్లా అధ్యక్షులు చిక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన జిల్లాలో గల 17 మండలాలు ఆరు మున్సిపాలిటీలు అట్టి మండలాల్లో గల గ్రామాల నుండి మన పద్మశాలీలను తరలించాలని శంఖారావం సభను విజయవంతం చేయాలని తెలియజేయడం జరిగినది ఇట్టి సమావేశంలో జిల్లా మహిళా విభాగం పూర్తి కార్యవర్గం జిల్లా యువజన విభాగం పూర్తి కార్యవర్గం మరియు జిల్లా ప్రముఖులు చిక్క వెంకటేశ్వర్లు బొట్ల పరమేశ్వర్ వంగారి బాల నరసయ్య చింత కింది శ్రీధర్ శ్రీరామ్ సత్తయ్య వలందాసు ఆదినారాయణ బింగి వైకుంఠం కాటబత్తిని ఆంజనేయులు మంత్రి బాలరాజు బింగి జంగయ్య గాడి పల్లి శ్రవణ్ సామల భాస్కర్ మరియు పూర్తి కార్యవర్గం పాల్గొన్నారు.



## బి.అర్.ఎస్ నాయకులను పరామర్శించిన డోర్నకల్ ఎమ్మెల్యే

**మహబూబాబాద్ కురవి, విశాల భారతి :** మహబూబాబాద్ జిల్లా కురవి మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెద్ది వెంకన్న, బాలపాల ఎం.పి.టి.సి పిట్టల రమణ, వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో గాయపడి మహబూబాబాద్ లోని పలు హాసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించిన ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ఈ కార్యక్రమంలో జిల్లా గ్రథాలయ ఛైర్మన్ గుడిపూడి, నవీన్ రావు, జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, బి.అర్.ఎస్ కురవి మండల అధ్యక్షుడు తోట లాలయ్య, యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి, బానోత్ రాము, మాలోత్ సూర్య తదితరుల పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ ని సన్మానించిన బీఆర్ టియు నాయకులు వరప్రసాద్ రెడ్డి

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని టికెట్ కేటాయించడంతో బి.ఆర్.టి.యు నాయకులు వి. వర ప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో కార్మిక నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించుకొని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు లక్కన్, ఉద్యానంద్, రామ్ తివారి, పద్మ మరియు ఆటో యూనియన్ నాయకులు నాగిరెడ్డి, జంగిరెడ్డి, సురేష్, మధు, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## పటాన్ చెరు టిక్కెట్ నీలం మధుకు కేటాయించాలి

- బీఆర్ఎస్ పై మండిపడుతున్న ముదిరాజ్ లు
- నీలం మధుకు టిక్కెట్ ఇవ్వాలని నిరసనలు, సమావేశాలు



**పటాన్ చెరువిశాలభారతి:** బీఆర్ఎస్ పార్టీపై ముదిరాజ్ లు మండిపడుతున్నారు..పటాన్ చెరు సీటు నీలం మధు ముదిరాజ్ కు కేటాయించాలని కోరుతూ నిరసన చేపడుతున్నారు, సమావేశాలు ఏర్పాటు చేసి నీలం మధుకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తెలంగాణలో 60 లక్షలు ముదిరాజులు ఉండగా, ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంతో భగ్గుమంటున్నారు. పటాన్ చెరు పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు నిరసన తెలిపి, పటాన్ చెరు టికెట్ నీలం మధుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలం ముంబాపూర్ గ్రామంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు రాస్తా రోకో చేశారు.

**'నీలం మధు'కు న్యాయం చేయాలి..**

**ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు టప్ప కుమార్**

పటాన్ చెరు నియోజకవర్గం నుంచి నీలం మధు ముదిరాజ్ కు అవకాశం ఇవ్వాలని ముదిరాజ్ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు టప్ప కుమార్ డిమాండ్ చేశారు.
మంగళవారం పటాన్ చెరు పట్టణంలోని ముదిరాజ్ భవన్ లో ముదిరాజ్ సంఘం నాయకులు, ఎన్ఎంఆర్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు...తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షలకు పైగా ముదిరాజులు ఉన్నారని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల లిస్టులో ముదిరాజులకు స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలో 70 వేలకు పైచిలుకు ముదిరాజ్ ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు పునరాలోచించి నీలం మధు ముదిరాజ్ కు పటాన్ చెరు సీటు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు జె.ఎట్టయ్య ముదిరాజ్, దేవరాజ్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, శ్రీను ముదిరాజ్, నాగరాజ్ ముదిరాజ్, సాయిరాజ్ ముదిరాజ్, శ్రీను ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే టికెట్ నీలం మధు ముదిరాజ్ కే ఇవ్వాలి..**

**తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎన్ఎంఆర్ యువసేన సభ్యుల నిరసన**

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ కు, బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పునరాలోచించి పటాన్ చెరు నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు రవి చారి, రమేష్, బాలకృష్ణలు డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన వాటిలో పటాన్ చెరు నియోజకవర్గానికి నీలం మధు ముదిరాజ్ పేరు లేకపోవడం మా అందరికీ కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కొరకు నీలం మధు ముదిరాజ్ ఎంతో కష్టపడి పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఎన్ఎంఆర్ యువసేన ఏర్పాటు చేసి పటాన్ చెరు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, ఎందరికో ఆర్థిక సహాయాలు చేస్తూ, పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు సురేష్, మహేష్, రాములు, అనంతయ్య, నర్సింలు, తలారి వెంకటేష్, మన్నె కృష్ణ, యువ కిషోర్, సుభాష్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ ఘాట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి**

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** బొల్లారం మున్సిపల్ పరిధిలోని కుడికుంట వద్ద నిర్మిస్తున్న బతుకమ్మ ఘాట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం నాడు ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, జై శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




## 'పర్యావరణ బాధ్యత అందరిదీ'

**తుర్కయంజాల్, విశాలభారతి:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలను నాటాలని తుర్కయంజాల్ కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలతఅనిల్‌కుమార్ తెలిపారు. హరితహారం సందర్భంగా ఉమర్‌ఖాన్‌గూడలో మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలత అనిల్‌కుమార్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం చేపట్టిందన్నారు. ఆక్సిజన్ పెరగాలంటే మొక్కలు నాటాలని ప్రతీఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పెంచి పెద్ద చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆక్సిజన్ పెరగాలంటే హరితహారాన్ని మించిన కార్యక్రమం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తూళ్ల శంకరయ్య గౌడ్, జిల్లెల విజేందర్ రెడ్డి, గొట్టె యోజిత్, యువాచ్, సహదేవ్, బబ్లూ, టిప్పు, హరితహారం విభాగం సూపర్‌వైజర్ మస్కు భగత్, భరత్,రవి, లక్ష్మి, శైలజ, నరసింహ, పెంటయ్య మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్థానికులు తదితరులు పాల్గొన్నారు









## రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం

**కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మఠంపల్లి, విశాల భారతి :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 80 సీట్లు పైన గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని మాజీ పీసీసీ అధ్యక్షులు నల్గొండ పార్లమెంటు సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈరోజు మఠంపల్లి మండల కేంద్రంలో ఒక ఫంక్షన్ లో హాజరైన తర్వాత మాజీ సర్పంచ్ స్రవంతి కిషోర్ రెడ్డి గారి ఇంటిలో మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని హుజూర్నగర్ నియోజక వర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు దాదాపు ఖాయమైందని ఆయన అన్నారు వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల పనిచేసి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలని అధికార పార్టీ అంగ బలం అర్ధ బలం అధికార దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికులుగా పనిచేయాలని ఆయన అన్నారు హుజూర్నగర్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి గతంలో మనం చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని మాజీ పీసీసీ అధ్యక్షులు నల్గొండ పార్లమెంటు సభ్యులు శ్రీ కెప్టెన్ ఉత్తంకుమార్ రెడ్డి గారు అన్నారు ఈరోజు మఠంపల్లి మండల కేంద్రంలో ఒక ఫంక్షన్ లో హాజరైన తర్వాత మాజీ సర్పంచ్ స్రవంతి కిషోర్ రెడ్డి గారి ఇంటిలో మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని హుజూర్నగర్ నియోజక వర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు దాదాపు ఖాయమైందని ఆయన అన్నారు వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల పనిచేసి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలని అధికార పార్టీ అంగ బలం అర్ధ బలం అధికార దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికులుగా పనిచేయాలని ఆయన wఅన్నారు హుజూర్నగర్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి గతంలో మనం చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించారు.



## సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయండి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు(జిన్నారం), విశాలభారతి:** నేడు మెదక్ లో జరగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. జిన్నారం మండలం ఊట్ల గ్రామంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం నుండి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే భాస్కర్ రావు



**మిర్యాలగూడ, విశాల భారతి:** సీఎం కేసీఆర్ సోమవారం 115మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో, మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి గా మరోసారి తమకు సీటు కేటాయించిన సందర్భంగా, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి తో కలిసి, శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు ప్రగతి భవన్ లో సీఎం కేసీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే భాస్కర్ రావు మాట్లాడుతూ, మరోసారి మిర్యాలగూడ గడ్డపై అత్యధిక మెజారిటీతో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. తన ఎన్నికకు సంహరించిన మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## దుర్గం చిన్నయ్య కి శుభాకాంక్షలు తెలిపిన టీబిజికెఎస్ నాయకులు



**విశాలభారతి,బెల్లంపల్లి:** ఎమ్మెల్యేచిన్నయ్య కి శుభాకాంక్షలు తెలిపిన టిబిజీకెఎస్ నాయకులు సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించిన బీఆరెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో బెల్లంపల్లి నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు మూడోసారి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో బెల్లంపల్లి టిబిజీకెఎస్ నాయకులు హైదరాబాద్ లో ఎమ్మెల్యే చిన్నయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీబిజికెఎస్ నాయకులు, గెల్లి రజలింగ్, దాసరి శ్రీనివాస్,వెంకటరమణ, తదితరులుఉన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

**నల్లగొండ, విశాలభారతి :** జిల్లా ఎస్పీ అపూర్వ రావు ఐపీఎస్ ఆదేశానుసారం నల్లగొండ పట్టణంలోని పానగల్ జెడ్పీ హైస్కూల్ మిర్యాలగూడ లోని కాకతీయ పాఠశాలలలో దాదాపు 350 విద్యార్థినులకు ఏర్పాటు చేసిన షీ టీమ్స్, సైబర్ నేరాల పైన అవగాహన కార్యక్రమంలో సిఐ గోపి మాట్లాడుతూ షీ టీమ్స్ మహిళల భద్రత రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నాయని అన్నారు. సైబర్ నేరాల విషయం లో చాలా అప్రమత్తంగా ఉండాలని మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుండి మహిళ రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. విద్యార్థులు తెలిసి తెలియని వయసులో చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త ఉండాలని సూచించారు అనంతరం సెల్ ఫోన్ ప్రభావంతో పక్కదారి పడుతున్న యువత, సెల్ ఫోన్ వలన కలిగే అనర్థాల గురించి,డైల్ 100, కుల వివక్ష అంటరాని తనం, బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు, బాలల హక్కులు తదితర అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో షి టీం ఇంఛార్జి సిఐ గోపి షి టీమ్ యస్.ఐ విజయ లక్ష్మి, భరోసా కో ఆర్డనేటర్ నళిని, పోలీస్ కళాబృందం విద్యార్థులు పాల్గొన్నారు.





## సీఎం కేసీఆర్ కు మించిన వ్యూహకర్త ఎవరు లేరు

- ప్రతిపక్షాల ఊహకు అందకుండా ఒకేసారి 115 మంది అభ్యర్థుల ప్రకటన
- సీఎం కెసిఆర్ మెదక్ పర్యటన సందర్భంగా ఘన స్వాగతానికి ఏర్పాట్లు
- మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యలు అర్ధరహితం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు(గుమ్మడిదల)- విశాల భారతి:**

ముఖ్యమంత్రి కెసిఆర్ కుమించిన వ్యూహకర్త ఎవరు లేరని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఒకేసారి 115 మంది బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు విడుదల చేసి ప్రతిపక్షాల ఊహకు అందకుండా చేశారని ఆయన చెప్పారు. నేడు మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న సందర్భంగా.. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల టోల్గేట్ వద్ద భారీ స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.మంగళవారం సాయంత్రం గుమ్మడిదల టోల్గేట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా గుమ్మడిదల మండలం అన్నారం నుండి మంబాపూర్ వరకు వేలాది మంది పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు వివిధ రూపాల్లో స్వాగతం పలుకుతారని తెలిపారు. గుమ్మడిదల టోల్గేట్ వద్ద సీఎం కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని ఆయన తెలిపారు. గుమ్మడిదల మండలానికి జూనియర్ కాలేజ్, మినీ స్టేడియం, గోదాం నిర్మాణానికి సహకరించాలని సీఎం కేసీఆర్ కి విన్నవించబోతున్నట్లు తెలిపారు.

**ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం..**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి పోటీ చేసే హక్కు ఉంటుందని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అంతిమంగా పార్టీ అధ్యక్షుడి నిర్ణయమే అంతిమమని తెలిపారు. రాబోయే ఎన్నికలలో ప్రతీ కార్యకర్త సైనికుడి వలె కృషిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్ కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు.

**ముదిరాజ్ లతో మాది స్నేహబంధం..**

తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన నాటి నుండి నేడు రెండుసార్లుగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే వరకు ముదిరాజులు ప్రతి అడుగులో తనకు అండగా నిలిచారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. తాను పుట్టిన బస్తీ ముదిరాజ్ బస్తీ అని, తన బాల్యం మొత్తం ముదిరాజ్ కులస్తులతో సాగిందని, నేటి వరకు వారితో కుటుంబ, స్నేహబంధం కొనసాగుతోందని తెలిపారు.

**మైనంపల్లి వ్యాఖ్యలు అర్ధరహితం..**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పై మల్కాజ్ గిరి శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు చేసిన వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన నుండి నేటి బంగారు తెలంగాణ రూప కల్పనలో మంత్రి హరీష్ రావు పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తున్న హరీష్‌రావు పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు షేక్ హుస్సేన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కేసీఆర్ కు రుణపడి ఉంటా

**సీఎం కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ, విశాల భారతి:** కోదాడ నియోజకవర్గానికి బిఆర్ఎస్ పార్టీ నుండి రెండవ సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చి, ఆశీర్వదించిన సీఎం కేసీఆర్ కు జీవితాంతం రుణపడి ఉంటానని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్, విద్యుత్ శాఖ మాత్యులు జగదీశ్ రెడ్డితో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మీ ఆశీస్సులు కలకాలం ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కోదాడ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించి గులాబీ జెండాను ఎగరేస్తానన్నారు. అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉంటాను అన్నారు.



# మునుగోడులో భారీ మెజారిటీతో గెలుస్తా

**సీఎం ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కూసుకుంట్ల**

**మునుగోడు, విశాలభారతి :** మునుగోడు నియోజకవర్గానికి బిఆర్ఎస్ పార్టీ నుండి మూడవ సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చి, ఆశీర్వదించిన సీఎం కేసీఆర్ కు జీవితాంతం రుణపడి ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మరియు తన కుమారుడు కూ సుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, సీ ఎం కెసిఆర్ ని విద్యుత్ శాఖమంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మీ ఆశీస్సులు కలకాలం ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ని కోరారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మునుగోడు నియోజక వర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించి గులాబీ జెండాను ఎగరేస్తానన్నారు. అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉంటానన్నారు.



# సాగర్‌లో ఎగిరేది గులాబీ జెండానే

**ఎమ్మెల్యే నోముల భగత్**

**హాలియా , విశాలభారతి :** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మరోసారి ఎగిరేది గులాబీ జెండానే అని ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థిగా నోముల భగత్ కుమార్ పేరు ప్రకటించిన సందర్భంగా ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి కేసిఆర్ ని మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటి రెడ్డి లతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించినందుకు మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధిక మెజారిటీతో గెలుస్తానని తెలిపారు.



# కోదాడ బరిలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా జలగం సుధీర్?

**కోదాడ, విశాల భారతి:** కోదాడ అసెంబ్లీ టికెట్ కోసం 2018, 2023లో బీఆర్ఎస్ పార్టీ నుండి ప్రయత్నం చేసినప్పటికీ అవకాశం రాకపోవటంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటిలో జలగం సుధీర్ ఉండనున్నట్లు సమాచారం. ఇప్పటికే 2 జాతీయ పార్టీలు సుధీర్ ను సంప్రదించి తమ తమ పార్టిల తరపున పోటి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేయటంతో ఆలోచించి చెపుతానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పెద్దలు కూడ సుధీర్ ను పోటిలో ఉండవద్దని, భవిష్యత్ లో మంచి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇష్యూ బేస్డ్ పాలిటిక్స్ లేదా జీరో బడ్జెట్ పాలిటిక్స్ పేరుతో స్వతంత్ర అభ్యర్దిగా వెల్లటమా లేదా ఏదైన జాతీయ పార్టీ తరపున పోటి చేయటమా అన్న విషయం మీద సుధీర్ తన సన్నిహితులతో సంప్రదింపులు జరుపుతున్నారు. సుమారు 60వేల మంది విద్యావంతుల్లో గట్టి పట్టున్న జలగం సుధీర్ పోటీలో ఉంటే అధికార పార్టీకి కొంత నష్టమే జరగొచ్చన్నది పరిశీలకుల అంచనా.

# పేదల సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

**ప్రభుత్వ విప్ ఆరేకపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద,మధ్య తరగతి కుటుంబాలకు అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. పేదలు నివసిస్తున్న ప్రాంతంలో ఆస్తి హక్కులను కల్పించడానికి జీఓ నెంబర్ 58,59 ద్వారా అవకాశం కల్పించి కూకట్పల్లి మండలంలో కూకట్పల్లి డివిజన్ పరిధిలోని లోని పాపిరెడ్డినగర్ కాలనీలో దరఖాస్తు చేసుకున్న వారికి జీఓ నెంబర్ 58, 59 ద్వారా యజమాని హక్కులను కలిపిస్తూ అర్హులైన 6 మంది లబ్ధిదారులకు రాజమణి హక్కు పత్రాలను ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండేది ముఖ్యమంత్రి కేసీఆర్ అని.. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు జీఓ నెంబర్ 58 ప్రకారం వారికి రెగ్యులరైజ్ చేసి జీవితంపై భరోసా కల్పించిన గొప్ప మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు.అదేవిధంగా 59 జి.ఓ కింద ప్రభుత్వం నిర్ణయించిన డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని సైతం పొందారన్నారు.ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న స్థల వివాదాలు సమస్యలో పేద మధ్య తరగతి కుటుంబాలు నివసిస్తున్న స్థలాలకు కూడా యాజమాన్య హక్కు లేకపోవడం ద్వారా పడుతున్న ఇబ్బందులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ముఖ్య మంత్రి ఒక గొప్ప అవకాశం కలిపించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరుకు తెలంగాణ ప్రజల జీవన విధానంలో మెరుగైన జీవనాన్ని అందించడానికి చేపడుతున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ నాయకులు ధర్మారావు, చెర్ల రామకృష్ణా రెడ్డి, కనకా రెడ్డి, తడకల రాజిరెడ్డి, ప్రేమకుమార్, తాటి కిరణ, ముత్యం వెంకటరెడ్డి , మహేందర్ రెడ్డి , మధుసూదన్ రెడ్డి , చంద్రయ్య, నరసింహ శ్యామలరావు , కనకయ్య , బాల నరసింహ ,వెంకట్ రెడ్డి విజయ్, లోకేష్ రావు, శ్రీకాంత్ రెడ్డి, శంకర్ రెడ్డి మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కేఎల్ఎన్ ప్రసాద్ బర్త్ డే వేడుకలు

**కోదాడ, విశాల భారతి:** టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది, కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కే ఎల్ ఎన్ ప్రసాద్ బర్త్ డే వేడుకలు మంగళవారం వారి నివాసంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు, గౌడ సంఘాల ప్రతినిధులు, టిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, జర్నలిస్టులు, పట్టణ ప్రముఖుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారి నీ గజమాలలతో శాలువా బొకేలతో సన్మానించి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటున్న కేఎల్ఎన్ ప్రసాద్ ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రానున్న రోజుల్లో ఉన్నతమైన పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పేద, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను బహుకరించారు. అనంతరం స్థానిక శ్రీనివాస్ నగర్ లో 100 మొక్కలను నాటారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎలక సుధాకర్ రెడ్డి, తమ్మినేని హనుమంతరావు, వక్కవంతుల నాగార్జున, ఈదుల కృష్ణయ్య, గౌడ సంఘం ప్రతినిధులు బాలే బోయిన శ్రీనివాస్ గౌడ్, వేలాద్రి గౌడ్, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారంగుల అంజన్ గౌడ్, గణేష్, లక్ష్మణ్, హరికిషన్, శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, భద్రం పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో టీచర్ పోస్ట్ కు అప్లై చేసుకోండి

**గరిడేపల్లి, విశాల భారతి :** గరిడేపల్లి మండలం గడ్డిపల్లి మోడల్ స్కూల్ లో గణితం బోధించుటకు ఎమ్మెస్సీ బీఈడీ మ్యాథ్స్ చేసిన అభ్యర్థులు ఆగస్టు 24 మరియు 25 తేదీలలో తమ విద్యా అర్హత పత్రాలతో గడ్డిపల్లి మోడల్ స్కూల్ లో జరిగే డెమోకి హాజరు అవ్వాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఐతరాజ సుధాకర్ తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులు 9 నుండి 12వ తరగతి విద్యార్థులకు గణితం బోధించాల్సి ఉంటుందని, అవర్ లీ బేస్డ్ కింద నెలకు 18000 వరకు శాలరీ ఉంటుందని తెలిపారు. వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ 9618066984 ను సంప్రదించాలని కోరారు.



# రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదు

**ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న.**

**మహబూబాబాద్, విశాల భారతి :** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రులు అన్నారు. ఈరోజు అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కమిటీ సమావేశం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక కామ్రేడ్ బట్టు అంజయ్య భవనంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్లకుంట సాయిలు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఢిల్లీ సరిహద్దులో రైతాంగం అనేక కష్టనష్టాలకు గురవుతూ సంవత్సరానికి పైగా ఉద్యమాన్ని కొనసాగించిందని ఫలితంగా మోడీ సర్కార్ రైతాంగానికి క్షమాపణ చెప్పి రైతాంగ సమస్యలు పరిష్కరిస్తారని చెప్పి లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన నేటి వరకు అమలు పరచకపోవడం ప్రభుత్వం నెరవేర్చకపోవడం విచారకరమని వారన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని అమలు పరచాలని వారు డిమాండ్ చేశారు. అలాగే స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధర ప్రకటించి గ్యారెంటీ చట్టం చేయాలని కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతాంగానికి అమలు పరచాలని రైతులకు రుణ విముక్తి చట్టాన్ని చేయాలని కోరారు. లకింపూర్ కేరి ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని రైతాంగ అమరవీరుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియన్ చెల్లించాలని రైతులపై ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్.కే.ఎమ్ ఆధ్వర్యంలో ఈనెల 27న మహబూబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి సదస్సు ఉంటుందని ఈ సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే బాబు, జిల్లా నాయకులు టేకుమట్ల సమ్మయ్య, చింత వెంకన్న, మాలోతు అలా, పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి**

**పాలకుర్తి, విశాల భారతి :** పాలకుర్తి మండల కేంద్రంలోని రెడ్డి గార్డెన్ లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి' సమావేశానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి నియోజకవర్గం బాధ్యురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి పాలకుర్తి మండలానికి చేరుకోగా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు, పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్ అధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి ఆమెకు ఘన స్వాగతం పలికి భారీ జన సముదాయంతో రెడ్డి గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలతో జరిగిన విస్తృ త స్థాయి సమావేశం లో వారు మాట్లాడుతూ" రాబోయే ఎన్నికల లో పాలకుర్తిలో ఎగిరేది కాంగ్రెస్ జెండా నినని కార్యకర్తలు అధైర్య పడవద్దు అని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు, ఈ విస్తృ త స్థాయి సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గం నుండి వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఐఐఎచ్ఎఫ్ చైర్మన్ నీ కలిసిన దళిత ఐక్య సంఘటన సభ్యులు

**బాల్కొండ,విశాలభారతి:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ గా నియమించిన డా.మధుశేఖర్ నీ బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండల దళిత ఐక్య సంఘటన కార్యవర్గం సభ్యులు మండల అధ్యక్షుడు గడాల ప్రసాద్,కార్యదర్శి గంట భాగేష్, మొండి ప్రశాంత్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గడల ప్రసాద్, గంట భాగేష్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గత 30 సంవత్సరాలుగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యంలో సర్జికల్,మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించి ఎందరికో ఉచిత ఆపరేషన్లు చేసిన గొప్ప వ్యక్తి డా.మధుశేఖర్ అటువంటి సేవ దృక్పథం కలిగి ఉన్న వ్యక్తికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ గా నియమించిన రాష్ట్ర ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో డా.మధుశేఖర్ కి మరిన్ని ఉన్నత పదవులు రావాలని ఈ సందర్భంగా వారు కాంక్షించారు.



**అంతర్గత డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణానికి**

# శంకుస్థాపన చేసిన మంత్రి మల్లారెడ్డి


**బోడుప్పల్,విశాలభారతి:** బోడుప్పల్ నగర పాలక సంస్థ 21 డివిజన్ పరిధిలోని రాజశేఖర్ కాలనీలో 20 లక్షల రూపాయలతో అంతర్గత డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుచ్చిరెడ్డి గారు డిప్యూటీ మేయర్ శ్రీమతి లక్ష్మీ రవిగౌడ్ గౌరవ స్థానిక కార్పొరేటర్ భూక్య సుమన్ కార్పొరేటర్లు , కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, కమిటీల సభ్యులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

# దుర్గం చిన్నాయ్యకు టికెట్ కేటాయించిన కెసిఆర్ కి కృతజ్ఞతలు

**నేతకానీ మహర్ సంఘం**



**విశాల భారతి బెల్లంపల్లి :** బెల్లంపల్లి నియోజకవర్గం లో ముచ్చటగాగా మూడో సారి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కు అవకాశం ఇచ్చినందుకు నేతకాని కుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేసారు,మొదటి దఫలో మూడో సారి ఎమ్మెల్యే అభ్యర్థి గా చిన్నయ్య ను ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తు నేతకాని కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్య మంత్రి కే.సి.ఆర్ కి నేతకాని మహా కుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతు మరి 50000 వేల మెజారిటీ తో ఎమ్మెల్యే గా చిన్నయ్య గెలిపించుకోని బంగారు పల్లకిలో అసెంబ్లీ లో అడుగు పెడతామని అలాగే నేతకాని సంఘం నాయకులు ప్రజలు కాకుండా ఆలోచించాలని గ్రామాల్లో ,మండలాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అభివృద్ధి చేసేది చాలా వుందని మళ్ళీ ఎమ్మెల్యే గెలిపించాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో దుర్గం గోపాల్ తెలంగాణ నేతకాని మాహార్ కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కళాలి నరసయ్య తెలంగాణ నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు,గోమాస రాజం రాష్ట్ర కార్యదర్శి రామటెంకి వాసుదేవ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్కా మెర దుర్గయ్య జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మడి లక్ష్మణ్ జిల్లా కార్యదర్శి కలాలి వెంకటేష్ దుర్గం రాజేశ్వర్ గోనే రవీందర్ దుర్గం శ్రీనివాస్ తాండూర్ దుర్గం శ్రీనివాస్ ఎమ్మెల్యే అభిమాని రత్నం సోమయ్య బోర్ల కుంట శ్రీనివాస్గా డి వేణు గోమాస శ్రీకాంత్ దుర్గం శ్రీనివాస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దుర్గం భాను ప్రసాద్ గోమాస క్రాంతి గోమాసమణిదీప్ రత్నం ప్రకాష్ రామటెంకి ప్రకాష్ తామర ఉదయ్ కుమార్ గోమాస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు .



# సమాజానికి "చిరు" సేవ ఆదర్శం

**ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ సైదులు గౌడ్**

**గరిడేపల్లి, విశాల భారతి :** సమాజంలో సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి అందిస్తున్న చిరు సేవలు చిరస్మరణీయమైనవి అని గరిడేపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ సైదులు గౌడ్ అన్నారు. గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డి గూడెం గ్రామంలో చిరంజీవి అభిమాన సంఘం మండల ఉపాధ్యక్షులు గోలి హుస్సేన్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ సైదులు గౌడ్,చిరంజీవి ప్రజా సేవా సమితి మండల గౌరవ అధ్యక్షులు తోడేటి వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథులుగా పాల్గొని చిరు అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం చిరు అభిమానులతో కలిసి ప్రైమరీ స్కూల్ పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్స్ లు,పలకలు, పెన్నులు,స్వీట్లు పంపిణీ చేశారు. మెగాస్టార్ చిరంజీవి సినీ జీవితానికే అంకితం కాకుండా మానవసేవే మాధవసేవ అంటూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ప్రాణదానం చేశాడని నేత్రదానం పేరుతో ఎంతోమందికి చూపునిచ్చాడని కరోనా సమయంలో ఆక్సిజన్ అందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలను కాపాడారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. సిపిఎం మండల కార్యదర్శి యాకోబు మాట్లాడుతూ చిరంజీవి సేవతోపాటు రాజకీయంలో తను పార్టీ పెట్టి ధనిక వర్గాలకు వారికి సీట్లు ఇవ్వకుండా అనగారిన వర్గాలైన బీసీ కులాలు ఎదుగుదలకై 100 సీట్లు ఇచ్చిన ఘనత ఒక్క మెగాస్టార్ చిరంజీవి గారికి దక్కిందని,ఆయన అభిమానులు కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, చిరు సేవలు అభిమానుల సేవలు చిరస్మరణీయమైనవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు మల్లం రమేష్, దాబాజీ, జాన్ పాషా, గోలి మదర్, ప్రధానోపాధ్యాయులు గ్రామస్తులు స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



# పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

**చిట్యాల, విశాలభారతి :** పిల్లలకు మంచి పోషక విలువలున్న పౌష్టికాహారాన్ని అందిస్తే ఆరోగ్యంగా ఎదుగుతారని వెలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. నరసింహ తెలిపారు. వెలిమినేడు పీహెచ్ లో తక్కువ అతి తక్కువ బరువు ఉన్న 16 మంది పిల్లలకి పరీక్షలు చేశారు. అందులో నలుగురు పిల్లల్ని న్యూట్రిషన్ సెంటర్ కి రిఫర్ చేశారు.16 మంది పిల్లలకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా పరిశుభ్రత పౌష్టిక ఆహారం గురించి పిల్లల తల్లులకి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డా.నర్సింహ, ఏసీడిపీ ఈవో వెంకటమ్మ అంగన్వాడీ టీచర్లు అండాలు సునీత నవనీత తదితరులు పాల్గొన్నారు.




# పెండింగ్ స్కాలర్ షిప్ లను విడుదల చేయాలి

**పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్**

**మహబూబాబాద్, విశాల భారతి :** పీడీఎస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు పీడీ ఎస్ యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ఎస్ యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్, జిల్లా నాయకులు గొడిశాల మనోజ్ మాట్లాడుతూ... పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్మెంట్స్ ఫీజ్ లను వెంటనే విడుదల చేయాలని, హాస్టల్ కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మొటిక్ ఛార్జీలు, మెస్ చార్జీలు పెంచాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుంది అని ఎన్నికలు సమీపిస్తున్న వేళ అక్రమ మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చడంలో ఉన్న శ్రద్ధ,చిత్తశుద్ధి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ల విడుదల పైన లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. బేషరతుగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను విడుదల చేయకుంటే, దశలవారీగా అధికార పార్టీ నాయకుల ఇండ్లు, క్యాంపు కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. నాయకులు అనిల్, రాంబాబు, కృష్ణ, వంశీ,మురళి వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అలర్ట్ గా ఉండాలి

**చిట్యాల, విశాలభారతి:** ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డా.గట్టు కిరణ్ కుమార్ అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో స్థానిక కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్ అధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ గట్టు కిరణ్ కుమార్ వార్డులోని ప్రజలకి హెల్త్ చెకప్ చేసి బీపీ షుగర్, డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్ సంబంధిత వాటి గురించి పలు సూచనలు చేశారు. రక్త పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వాతావరణం లో జరుగుతున్న మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి ప్రతి ఒక్కరూ ఇంట్లో మరియు ఇంటి చుట్టూ చెత్తాచెదారం నిల్వ నీళ్లు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్ వార్డులోని ప్రజలు ప్రతి ఒక్కరు కూడా పరిశుభ్రతను పాతిచాలని వర్షాభావ పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఇంట్లో పూల కుండీలు నీటి తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలనీ ఏవైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వార్డులో పరిస్థితిని తెలియపరచగానే హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసిన డాక్టర్ కిరణ్ కుమార్ కి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ దాసరి నర్సింహా, బెల్లం క్రాంతి కుమార్, గండ మల్ల శంకర్, మొహమ్మద్ యాసిన్, ఏఎన్ఎం సిహెచ్. పుష్పలత, ఆశా వర్కర్ శైలజ కాలనీ వాసులు పాల్గొన్నారు.



# మహాధర్నా ను సక్సెస్ చేయండి

**నూతనకల్, విశాల భారతి :** ఈనెల 29న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద ఐ ఎఫ్ టి యు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నా ను సక్సెస్ చేయాలని నూతనకల్ మండల కేంద్రంలో పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా కమిటీ సభ్యులు పచ్చిపాల లింగయ్య, హమాలీ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి మధు,తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బాబ్, జాని లు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హమాలి, ఆటో, మోటారంగ కార్మికులకు చట్టబద్ధహక్కులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, వీరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అన్నింటిని మెరుగుపరచాలని, ప్రమాద బీమాకు 10 లక్షల వరకు పెంచాలని, పిఎఫ్, 50 ఏళ్లు దాటిన కార్మికులకు 6000 రూపాయల పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడి కనీస వేతనం పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు 27 వేల రూపాయలు చెల్లించాలని అన్నారు. కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్,స్కీం విధానాన్ని రద్దు చేయాలని, వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ కార్మికుల కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని,కనీస వేతనాలను పెంచాలని అన్నారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం చిన్న చూస్తుందని వీరికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పాలకులు ఒక్కొక్కటిగా ప్రవేటికరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం, హమాలి ఫెడరేషన్ నాయకులు సైదులు, వెంకటేష్, సత్తయ్య, వెంకన్న, దాసు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**ఏమి రెడ్డి పాండురంగారెడ్డి**




**అమనగల్లు,విశాలభారతి:** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆమనగల్ ఆధ్వర్యంలో క్రీ.శే. భారతమ్మ మాధవరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారులు ఏమి రెడ్డి పాండురంగారెడ్డి,వెంకటేశ్వర రెడ్డి లు ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి దాసరి కిష్టమ్మ తో కలిసి ఏమి రెడ్డి పాండురంగారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి లు ప్రారంభించారు. అనంతరం పాండురంగారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ను అభినందించారు. నియోజకవర్గస్థాయిలో లయన్స్ క్లబ్ ఉచితంగా కంటి వైద్య శిబిరాల నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం కంటి చూపు మందగించిన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం గొప్ప సేవ అని కొనియాడారు. క్లబ్బు చేస్తున్న సేవలను సభ్యులను మెగా వైద్య శిబిరంలో 612 మందికి జనరల్ వైద్య మరియు మధుమేహ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా దంత పరీక్షలు కీళ్లనొప్పులు ఆర్తో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్లు దామోదర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,కృష్ణ,మురళీదర్ కోల, శివారం, వెంకటేష్, మానస, హరికాంత్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, తదితర వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు.



ఈ శిబిరాన్ని మాజీ గవర్నర్ జి చెన్నకిషన్ రెడ్డి, రిజియన్ చెర్మన్ ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. హెల్త్ క్యాంపు నిర్వహించిన ఏమి రెడ్డి పాండురంగారెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి క్లబ్ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ శేఖర్ రెడ్డి, రీజినల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి,కోశాధికారి కొరివి వెంకటయ్య,పిఆర్వో పాషా,కంటి వైద్యులు చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,రంగారెడ్డి,అంజిరెడ్డి,చెన్నారం సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి, బుచ్చిరెడ్డి,నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, మహిపాల్,మాజీ ఎంపీటీసీ యాదయ్య, వెంకటరెడ్డి,జంగారెడ్డి ,హెడ్మాస్టర్ రామనాథం, మాజీ సర్పంచ్ ఆనంద్,ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి,జూలూరు రమేష్,అంజయ్య, భావండ్ల వెంకటేష్, మోహన్ రెడ్డి, నర్సింహా,కరుణాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి,లింగయ్య, కొండల్ రెడ్డి,నటరాజ్ యాదయ్య,మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఓటమి భయంతోనే కేసీఆర్ కామారెడ్డిలో పోటీ

**శాలిగౌరారం, విశాల భారతి :** తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎంపీటీసీ నోముల జనార్ధన్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే ఓటమి భయంతో అభ్యర్థులను ప్రకటించారని, కెసిఆర్ రెండు స్థానాలను పోటీ చేయడం అంటే ఆయన ఓటమి ఒప్పుకున్నట్లేనని అన్నారు. గజ్వేల్ ప్రజలు ఓడించేందుకు సిద్ధంగా ఉండగా కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేసేందుకు సెకండ్ ఆప్షన్ గా ఎంచుకున్నారన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ ను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని,రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. .



# మైనార్టీ విద్యార్థి చదువుకు అండగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్

**అమనగల్లు, విశాలభారతి:** మాడుగుల మండలం అందుగుల గ్రామానికి చెందిన హసిన బేగం భర్త ఎం.డి.అజీమ్ కూమారుడు సోయాబ్ అనే అబ్బాయి 3వ. తరగతి చదువుతున్నాడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. విషయం తెలుసుకున్న జెడ్పిటిసి సోయాబ్ చదువుకు అండగా నిలిచిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా 10,000 వేల రూపాయలు చెక్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో వీర బొమ్మ బుచ్చిబాబు, రుద్రాక్షల శీను, మురళి, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేను కలిసిన వెల్మల్ నాయకులు

**ఆర్మూర్, విశాలభారతి:** మంగళవారం నాడు ఆర్మూర్ ఎమ్మెల్యే పియుసి చైర్మన్ బారాస పార్టీ నిజామాబాద్ అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డిని బంజారా హిల్స్ లోని మినిస్టర్ క్యాంపులో వెల్మల్ గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు ఈ సందర్భంగా నందిపేట్ మండల వైస్ ఎంపీపీ గుజ్జా దేవేందర్ మాట్లాడుతూ ఆర్మూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అశన్న గారి జీవన్ రెడ్డిని మూడవసారి బి అర్ ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశన్న గారి జీవన్ రెడ్డిని ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేశారు వచ్చే ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించి మంత్రిగా చూడాలని ఆశాభావం వ్యక్తం చేశారు ఎమ్మెల్యేను కలిసిన వారిలో వెల్మల్ ఎంపిటిసి శంకర్, యువ నాయకులు శుభాకర్, గంగాధర్ ,సంతోష్, శ్రీనివాస్, తదితరులు కలిశారు.



# బోగస్ వికలాంగుల సర్టిఫికెట్లను గుర్తించాలి

**డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డేఫ్ అధ్యక్ష కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్,వి భారతి..**

**ముషీరాబాద్,విశాల భారతి:** బోగస్ వికలాంగుల సర్టిఫికెట్లు ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డేఫ్ అధ్యక్ష కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్ వి భారతి అన్నారు. ఈ సందర్భంగా నల్లకుంటలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రభుత్వ శాఖలో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేసింది. దివ్యాంగుల బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. దివ్యాంగుల కోసం బంధు పథకంతో పాటు నిరుద్యోగ దివ్యాంగులకు నిరుద్యోగ భృతి, బ్యాక్లాగ్ ఉద్యోగుల భర్తీ చేయాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని కలిసి కొరతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగాలను దివ్యాంగులతో భర్తీ చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆసరా పింఛన్లు పదివేలకు పెంచాలని, నిరుద్యోగ దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పరిరక్షణ చట్టం 2016 సెక్షన్ 92 పై పూర్తిగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చెయ్యాలె..

**పి డి ఎస్ యు డిమాండ్**

**రాంనగర్,విశాల భారతి:** పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్వర్యంలో విద్యా నగర్ నుంచి రాంనగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మద్యం టెండర్స్ కు మూడు నెలల ముందే నోటిఫికేషన్ విడుదల చేసిన ముఖ్యమంత్రి సంవత్సరాల గడుస్తున్న 5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ ,స్కాలర్ షిప్స్ బకాయిలు చెల్లింకపోవడం దుర్మార్గమన్నారు.మద్యం దుకాణాల పట్ల ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువులపై లేకపోవడం శోచనీయమన్నారు. పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు గడ్డం శ్యామ్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నా కల అని చెప్పి నేడు పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరంచేసే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట వ్యాప్తంగా ఉద్యమం నిర్మాణం చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కంచనపల్లి శ్రీను, జిల్లా నాయకులు గౌతం,గణేష్, లక్ష్మణ్, మహేష్,వికాస్,శివ,సాయి తదితరుల పాల్గొన్నారు.

# ప్రజల హృదయాల్లో గద్దర్ చిరస్మరణీయుడు

**ప్రొఫెసర్ కాశీంకే**



**సూర్యాపేట, విశాల భారతి :** పాట ఉన్నంతకాలం ప్రజల హృదయాలలో గద్దర్ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ప్రొఫెసర్ కాశీం అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో ప్రజా యుద్ధనౌక గద్దర్, లౌకిక ప్రజాస్వామిక వాది జహీర్ అలీ ఖాన్ ల సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. పాటే ప్రాణంగా చివరి వరకు నిలిచిన ఏకైక కళాకారుడు గద్దర్ అని, తన ఆట పాట ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ప్రపంచంలో గద్దర్ ను మించిన కళాకారులు మరొకరు లేరన్నారు. తన జీవితాంతం తాడిత ,పీడిత ,పేద ప్రజల అభ్యున్నతి కోసం పని చేశారని అన్నారు. శరీరంలో తూటా ఉన్నప్పటికీ ఏ మాత్రం భయపడకుండా పోరాటాన్ని కొనసాగించారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కళాకారుడు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి,అరుణోదయ,బహురూపల కళామండలి కళాకారుల ఆట పాటలు సభలో పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం గద్దర్, జహీర్ అలీ ఖాన్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. గద్దర్, జహీర్ ఖాన్ స్మారక కమిటీ అధ్యక్షులు నార బోయిన వెంకట యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో ఖమ్మంపాటి రాము, మట్టిపల్లి సైదులు, మండారి డేవిడ్ కుమార్ ,ధర్మార్జున్,మాంద్ర మల్లయ్య యాదవ్, శివకుమార్,బుద్ధ సత్యనారాయణ, బోడ భానుప్రసద్ ,చామకూరి నరసయ్య,దాసరి రాములు, రేపాక లింగయ్య, ముప్పాని కృష్ణారెడ్డి, నాయకులు తీగల జనార్ధన్, ఆవుల నాగరాజు,కరీం, మాధవరెడ్డి, గుండాల సందీప్,పోలె బోయిన కిరణ్, కోటయ్య, ఎర్రమళ్ళ రాములు, సోమశేఖర్, తగుళ్ళ జనార్ధన్ పాల్గొన్నారు.


## బీఆర్ఎస్ లో బీసీలకు తీవ్ర అన్యాయం

**బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్**



**సూర్యాపేట,విశాల భారతి :** సూర్యాపేట పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రకటించిన 115 అసెంబ్లీ స్థానాల లో బీసీలకు కేవలం 23 సీట్లు ప్రకటించడం చాలా దుర్మార్గమని అన్నారు. 56శాతం ఉన్న బీసీ జనాభాకు 20 శాతం సీట్లు కేటాయించడం బీసీలను అణగదొక్కడమే అన్నారు. రెండు మూడు శాతం ఉన్నవారికి 60 శాతం టికెట్లు కేటాయించడం సామాజిక న్యాయాన్ని బొంద పెట్టడమే అని విమర్శించారు. ప్రతి నియోజకవర్గంలో సగానికి పైగా ఉన్న బీసీల కు న్యాయబద్ధంగా దక్కవలసిన అసెంబ్లీ స్థానాలు దక్కకుండా బీ అర్ ఎస్ పార్టీ అన్యాయం చేసింది అన్నారు.

# మెగా న్యూ మూవీస్ అనౌన్స్ మెంట్






మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజుని పురస్కరించుకుని స్వచ్ఛంద సేవా, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేస్తూ మెగా బర్త్ డేని జరుపుకునే అభిమానులకు ఇది ఒక పండగ లాంటి రోజు. మెగా అభిమానులను మరింత ఆనందపరిచే విధంగా, మెగాస్టార్ చిరంజీవి తదుపరి చిత్రం మెగా156 ఈరోజు అనౌన్స్ చేశారు. మెగా156 చిత్రాన్ని చిరంజీవి ఖైదీ నంబర్ 150వ చిత్రం నుండి స్టైలిస్ట్ గా వ్యవహరిస్తున్న సుస్మిత కొణిదెల భారీ స్థాయిలో నిర్మించనున్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మెగా156 రూపొందనుంది. 155 చిత్రాల తర్వాత, ఇప్పుడు #MEGA156 మెగారాకింగ్ ఎంటర్టైనర్ అవుతుంది. చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు'' అని ప్రొడక్షన్ హౌస్ ట్వీట్ చేసింది. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తారు.

**మెగాస్టార్ చిరంజీవి, వశిష్ఠ, యువి క్రియేషన్స్ మెగా మాస్ బియాండ్ యూనివర్స్ - మెగా157 అనౌన్స్ మెంట్**

ఇది మీ ఊహకు మించి ఉంటుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' లాంటి మరో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో చిరంజీవిని చూడాలని ఉత్సాహంగా ఉన్న అభిమానులు ఈ అనౌన్స్ మెంట్ తో మరింత సంతోషిస్తారు. చాలా కాలం తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఒక ఫాంటసీ మూవీకి సైన్ చేశారు. తన తొలి చిత్రం 'బింబిసార'తో మనల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిన వశిష్ఠ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సక్సెస్ ఫుల్ యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వి వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డి కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందబోతున్న #మెగా157 చిరంజీవి కెరీర్‌లోనే మోస్ట్ ఎక్స్ పెన్సివ్ చిత్రంగా వుంటుంది. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఈరోజు అఫీషియల్ గా అనౌన్స్ చేసిన ఈ సినిమాతో వశిష్ట మనకు మెగా మాస్ యూనివర్స్ చూపించబోతున్నారు.



# సమాజంపై మంచి ఆలోచన రావాలనే ఉద్దేశంతో చేసిన సినిమా

**: మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ అండ్ ఎమోషనల్ థ్రిల్లర్ 'గాండీవధారి అర్జున'. ఈ సినిమాలో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించారు. స్టైలిష్ ఫిల్మ్ మేకర్ ప్రవీణ్ సత్తారు ఈ మూవీని తెరకెక్కించారు. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ మీద నిర్మించిన ఈ సినిమా ఆగస్ట్ 25న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ సందర్భంగా గాండీవధారి ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో .... మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. 'నాకు హోలీడే అన్నా, పండుగ అన్నా కూడా మా పెదనాన్న మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజే. ఆయనకు అభిమానులందరి తరుపునా పుట్టిన రోజు శుభాకాంక్షలు. నా ఫస్ట్ డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల, నా చివరి దర్శకుడు అనిల్ రావిపూడి గారు,నా ప్రజెంట్ డైరెక్టర్ ఇదే స్టేజ్ మీదున్నారు. ఈ సినిమాలోని కోర్ పాయింట్ వల్లే ఒప్పుకున్నాను. ఎప్పుడూ మన కుటుంబం గురించి ఆలోచిస్తుంటాం. కానీ ఇలాంటి సినిమాలు చూసినప్పుడు సమాజం గురించి ఆలోచిస్తుంటాం. అలాంటి ఆలోచనల రావాలనే ఈ సినిమాను తీశాం. నిన్న రాత్రే ఈ సినిమాను చూశాను. మంచి సినిమా తీశామనే ఫీలింగ్ వచ్చింది. ఇంత మంచి సినిమాను నాకు ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. ఆగస్ట్ 25న థియేటర్లోకి సినిమా రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు. చిత్ర నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'వరుణ్ తేజ్‌తో మేం ఇది వరకు చేసిన తొలి ప్రేమ పెద్ద హిట్ అయింది. ఇప్పుడు ఈ సినిమా కూడా హిట్ అవుతుందని ఆశిస్తున్నాం. మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన చరణ్ బాబుకు థాంక్స్' అని అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ.. 'ప్రవీణ్ మేకింగ్, మిక్కీ సౌండ్ అద్భుతంగా ఉంది. విరూపాక్షతో ఈ బ్యానర్ ఆల్రెడీ హిట్ కొట్టింది. బాపీకి మరో హిట్ రాబోతోంది. ఫిదా, ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలు మా బ్యానర్లో వరుణ్ చేశాడు. ఈ సినిమాను ఆడియెన్స్ పెద్ద హిట్ చేయాలని కోరుతున్నాను' అని అన్నారు.

# 'బెదురులంక 2012'కు యాదృశ్చికంగా అలా కుదిరింది

**- హీరో కార్తికేయ**



యువ కథానాయకుడు కార్తికేయ గుమ్మకొండ, 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి జంటగా నటించిన సినిమా 'బెదురులంక 2012'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శుక్రవారం (ఆగస్టు 25న) సినిమా విడుదల కానున్న సందర్భంగా మీడియాతో కార్తికేయ ముచ్చటించారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు... అజయ్ భూపతి ద్వారా మా దర్శకుడు క్లాక్స్ నాకు పరిచయం అయ్యారు. రామ్ గోపాల్ వర్మ దగ్గర వాళ్ళిద్దరూ కొలీగ్స్. కరోనా సమయంలో నాకు క్లాక్స్ కథ చెప్పాడు. ఆ సమయంలో ప్రపంచం అంత అయిపోతుందని అన్నట్లు ప్రచారం జరిగింది కదా! కథకు బాగా కనెక్ట్ అయ్యాను. ప్రేక్షకుల్లో మార్పు వచ్చింది. కథలో కొత్తదనం, వినోదం ఉండటంతో ఓకే చేశా. నిజం చెప్పాలంటే... ఈ కథ విన్నప్పుడు నాకు విజువల్ ఏమీ కనిపించలేదు. ఫర్ ఎగ్జాంపుల్... కమర్షియల్ కథ విన్నప్పుడు అంతకు ముందు సినిమాల్లో విజువల్స్ ఫ్లాష్ అవుతాయి. సీన్స్ కొన్ని గుర్తు వస్తాయి. 'బెదురులంక 2012' కథకు రిఫరెన్స్ ఏమీ లేదు. అంత కొత్తగా ఉంటుంది. సినిమా కంప్లీట్ అయ్యాక చూసుకున్నా. నాకు చాలా హ్యాపీగా అనిపించింది. బాగా వచ్చింది. ఫన్, మెసేజ్ రెండూ ఉన్నాయి. ఆ సినిమాకు వచ్చిన ప్రేక్షకులు ఆలోచించేలా సన్నివేశాలు, డైలాగులు ఉంటాయి. వారిలో చిన్న మార్పు వస్తుందని నమ్ముతున్నాను. రెండున్నర గంటలు పూర్తిగా ఎంజాయ్ చేస్తారు. పంచ్ టు పంచ్ డైలాగులా కాకుండా సిట్యువేషన్ నుంచి జనరేట్ అయ్యే కామెడీ ఎక్కువ ఉంటుంది. నా క్యారెక్టర్ గురించి చెప్పాలంటే... శివ ఓ స్వేచ్ఛా జీవి. తనకు నచ్చినట్లు జీవిస్తాడు. సిటీలో గ్రాఫిక్ డిజైనర్ జాబ్ మానేసి ఊరు వెళతాడు. ఎవరైనా నన్ను జడ్జ్ చేస్తున్నారా? ఎవరైనా నేను చేసిన పని గురించి ఆలోచిస్తున్నారా? అని అసలు పట్టించుకోడు. అలాగని, ఎవరినీ ఇబ్బంది పెట్టడు. వాడి పని వాడు చేసుకుంటాడు. నచ్చని విషయం చేయమంటే అసలు చేయడు. 'ఆర్ఎక్స్ 100'లో మీ క్యారెక్టర్ శివ, గోదావరి నేపథ్యంలో కథ! 'బెదురులంక 2012'లోనూ మీ పేరు శివ, ఇవి రెండూ యాదృశ్చికంగా జరిగింది. కథ నచ్చి రెండు సినిమాలు చేశా. క్యారెక్టర్ పేరు శివ అని చెప్పినప్పుడు క్లాక్స్ తో అనలేదు. చాలా రోజుల తర్వాత అతనికి గుర్తు చేశా. తనకు ఆ సినిమాలో క్యారెక్టర్ పేరు గుర్తు లేదన్నాడు. ఆ క్యారెక్టర్, మైండ్ సెట్ కు శివ పేరు సెట్ అవుతుందని పెట్టానని చెప్పాడు. ఆ సెంటిమెంట్ వర్కవుట్ అయ్యి ఈ సినిమా కూడా హిట్ అయితే హ్యాపీ. హిట్ అవుతుందని నమ్మకంగా ఉన్నాం.

# నా రూమ్ లో సీక్రెట్ కెమెరా పెట్టారు



ణి సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ కృతి కర్బంద. మొదటి సినిమాతో నిరాశ పరిచిన కూడా తన అందాల ఆరబోత నేపథ్యంలో పలు సినిమాల్లో నటించే ఛాన్స్ ను దక్కించుకుంది. పవన్ కళ్యాణ్ తీన్మార్ సినిమాలో నటించడం ద్వారా మరింత పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో సక్సెస్ లు దక్కలేదు. తెలుగు సినిమాల్లో పెద్దగా ఆఫర్లు రాకున్నా కూడా కన్నడ, హిందీ సినిమాలు చేస్తూ కెరీర్ లో కొనసాగుతూ వస్తున్న ఈ అమ్మడు తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. హీరోయిన్స్ షూటింగ్స్ కు ఔట్ డోర్ వెళ్లిన సమయంలో.. ఇతర ప్రాంతాలకు వెళ్లిన సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారని కృతి తన మాటల ద్వారా చెప్పకనే చెప్పింది. కృతి కర్బంద మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాల క్రితం ఒక కన్నడ సినిమా షూటింగ్ నిమిత్తం బెంగళూరు వెళ్లాను. అక్కడ ఒక హోటల్ లో బస చేయాల్సి వచ్చింది. నేను ప్రైవేట్ ప్లేస్ ల్లో బస చేసే సమయంలో తప్పకుండా చుట్టు పక్కల క్షుణంగా చూస్తాను. నేను నా టీం మెంబర్స్ ఆ రూమ్ లో చూస్తూ ఉన్న సమయంలో ఒక సీక్రెట్ కెమెరా కనిపించింది. టీవీ సెటప్ బాక్స్ వెనక సీక్రెట్ కెమెరాను పెట్టి ఉంచారు. ఆ కెమెరా ను చూసి షాక్ అయ్యాను. ఇలాంటి దారుణమైన సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని అప్పడే అనిపించింది. నా రూమ్ లో సీసీ కెమెరా బయట పడ్డప్పటి నుండి కూడా మరింత జాగ్రత్తగా ఉంటున్నాను. ప్రతి ఒక్కరు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని కృతి సూచించింది.

# 'రాంబో' ఫస్ట్ లుక్



ఎన్టీఆర్ మహానాయకుడు, నారప్ప, పుష్ప, ధమాకా లాంటి విజయవంతమైన చిత్రాలలో కీలక పాత్రలు పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచుకున్న శ్రీతేజ్ హీరోగా పరిచయం అవుతున్నారు. శ్రీతేజ్ హీరోగా 'హిడింబ' లాంటి థ్రిలింగ్ బ్లాక్ బస్టర్ ని అందించిన శ్రీ విఘ్నేష్ కార్తీక్ సినిమాస్ బ్యానర్‌పై రత్నాకరం అనిల్ రాజు దర్శకత్వంలో నిర్మాత శ్రీధర్ గంగపట్నం ఓ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్ టైనర్ నిర్మిస్తున్నారు. శ్రీతేజ్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి 'రాంబో' అనే పవర్ ఫుల్ టైటిల్ ని పెట్టారు. ఫస్ట్ లుక్ లో శ్రీతేజ్ రగ్గడ్ అండ్ ఇంటెన్స్ లుక్ లో ఫెరోషియస్ గా కనిపించారు. రాంబో టైటిల్, శ్రీతేజ్ టెర్రిఫిక్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇటివలే వైజాగ్ షెడ్యుల్ పూర్తి చేయడంతో ఈ సినిమా టాకీ పార్ట్ పూర్తయింది. బ్యాలెన్స్ పాటలని చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.

# చీర కట్టులో శివాత్మిక



పింక్ కలర్ చీరలో తెల్లని ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ధరించి చాలా సింపుల్ అండ్ కూల్ లుక్ లో సందడి చేసింది. బాలీవుడ్ లో హీరోయిన్స్ గా ప్రస్తుతం ఉన్న వారిలో ఎక్కువ శాతం మంది స్టార్ కిడ్స్ ఉన్నారు. కానీ సౌత్ లో మాత్రం స్టార్ కిడ్స్ కి హీరోయిన్ గా ఛాన్స్ చాలా తక్కువగా వస్తున్నాయి. హీరోయిన్ గా రాణించాలని కొందరు హీరోల లేదా హీరోయిన్స్ కూతుర్లు ప్రయత్నాలు చేస్తున్నా కూడా బొక్క బోర్లా పడుతున్నారు. తెలుగు అమ్మాయిలకు హీరోయిన్స్ గా ఛాన్స్ లు రావని తెలిసి కూడా ప్రయత్నం చేసే వారు చాలా మంది ఉన్నారు. సీనియర్ స్టార్ హీరో రాజశేఖర్, జీవిత దంపతుల ఇద్దరు కుమార్తెలు కూడా హీరోయిన్స్ గా ఎంట్రీ ఇచ్చారు. అయితే ఇద్దరికి కూడా సరైన సక్సెస్ లు దక్కడం లేదు. నటిగా నిరూపించుకునేందుకు కూడా మంచి అవకాశాలు దక్కడం లేదు. అందం విషయంలో ఉత్తరాది ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా ఉన్నా కూడా ఆఫర్లు రావడం లేదు. ఈ మధ్య కాలంలో ఈ స్టార్ కిడ్స్ స్కిన్ షో వైపు కూడా అడుగులు వేస్తూ ఉన్నారు. చాలా అందంగా ఉండే శివాత్మిక రెగ్యులర్ గా హద్దులు దాటకుండా స్కిన్ షో చేస్తూ ఆకట్టుకుంటూ ఉంది. తాజాగా మరోసారి చీర కట్టులో కన్నుల విందు చేసింది. సోషల్ మీడియాలో శివాత్మిక రాజశేఖర్ షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పింక్ కలర్ చీరలో తెల్లని ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ధరించి చాలా సింపుల్ అండ్ కూల్ లుక్ లో సందడి చేసింది. నడుము అందం చూపించి చూపించకుండా చూపిస్తూనే, క్లీ వేజ్ షో తో కూడా మెప్పించిన శివాత్మిక ఫోటోలు చూసి చాలా మంది ఎందుకు ఆఫర్లు రావడం లేదని ఫీల్ అవుతూ ఉంటారు. శివాత్మికతో పోల్చితే ప్రస్తుతం ఉన్న హీరోయిన్స్ లో చాలా మంది తక్కువ అందంగానే ఉంటారు. అయినా కూడా శివాత్మిక కంటే వారికే ఎక్కువ ఆఫర్లు వస్తున్నాయి. శివాత్మిక కొత్త సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఔట్ ఫిట్ లో సందడి చేసినట్లుగా సోషల్ మీడియా ద్వారా తెలుస్తోంది. ఆమె కొత్త సినిమా గురించి మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.

# "మిస్టర్. X" షూటింగ్ ప్రారంభం



స్టార్ హీరోలు ఆర్య & గౌతమ్ కార్తీక్ కథానాయకులుగా మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియన్ మూవీ "మిస్టర్ X. స్టార్ యాక్టర్ శరత్ కుమార్, నటి మంజు వారియర్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్ కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైయింది. ఈ షెడ్యూల్ లో హీరోలు ఆర్య & గౌతమ్ తో పాటు ప్రముఖ తారాగణంపై కీలక సన్నివేశాలని చిత్రీకరిస్తారు. ఈ మేరకు షూటింగ్ స్టిల్స్ ని విడుదల చేశారు మేకర్స్. మిస్టర్ X తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.